PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 96 | విజయవాడ, శుక్రవారం 7 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 7 November 2025 | Rs

స్పిన్నర్ల మాయ
- నాల్గో టి20లో టీమిండియా ఘన విజయం

8

అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన, సహాయ కార్యదర్శులుగా ఎన్నికైన అదితి, గోపిక, సునీల్, దానిష్

గండిపడి నీరు బయటకు పోవడంతో ఖాళీగా కనిపిస్తున్న రాయల చెరువు రిజర్వాయర్

విరుచుకుపడ్డ విపత్తు

ఐదు గ్రామాలను ముంచెత్తిన రాయల చెరువు

- వరద నీటిలో కొట్టుకుపోయిన పశువులు
- ఇళ్లపైకి ఎక్కి ప్రాణాలు నిలుపుకున్న ప్రజలు
- మూగజీవాలు కోల్పోయి, పంటలు నష్టపోయి అన్నదాతల ఆక్రందన

పాతపాలెం అరుంధతివాడలో పేరుకుపోయిన బురద, మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి/ కెవిబి పురం (తిరుపతి జిల్లా)

రాయల చెరువుకు గండి పడటంతో గురువారం తెల్లవారు జామున ఐదు గ్రామాలు ఊహించని విపత్తు బారిన పడ్డాయి. ఏం జరిగిందో అర్థం చేసుకునే లోపే చెరువు నీరు ఆ గ్రామాలపై విరుచుకుపడింది. దాదాపుగా ఒక టిఎంసి నీరు ఒక్కసారిగా ముంచెత్తడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిగెత్తడం తప్ప ఏం చేయలేని నిస్సహాయ స్థితి ఆగ్రామాల ప్రజలది! తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఓల్లూరు సమీపంలోని రాయల చెరువు రిజర్వాయర్ కట్టకు గురువారం తెల్లవారుజామున అనూహ్యంగా గండిపడటంతో నెలకొన్న భయానక స్థితి ఇది! చెరువునీరు శరవేగంగా పాతపాలెం, పాతపాలెం దళితవాడ, పాతపాలెం అరుంధతివాడ, కళత్తూరు, కళత్తూరు హరిజనవాడలపై విరుచుకుపడింది. క్షణాల్లోనే నీటిమట్టం పెరిగిపోవడంతో నిద్రమంచం మీద నుండి లేచిన వారు లేచినట్టు కట్టుబట్టలతో పరుగులు తీశారు. గ్రామాల్లోనే ఉన్న ఎత్తైన ఇంటి డాబాలపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే, ఈ సంఘటనలో పశు సంపద పెద్ద ఎత్తున మృతి చెందింది. ఆవులు, గేదెలు,మేకలు, గొర్రెల మృతదేహాలు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. పెద్ద ఎత్తున ఆస్తినష్టం కూడా సంభవించింది. మోటారు బైకులు, ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్లు సైతం వరద ప్రవాహంలో కొట్టుకుపోవడం ప్రవాహ తీవ్రతను తెలియజేస్తోంది. తొమ్మిది అడుగుల ఎత్తులో చెరువు నీరు గ్రామాలపైకి దూసుకువచ్చిందని స్థానికులు చెబుతున్నారు. రాయల చెరువు రిజర్వాయర్‌కు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భారీగా వరద నీరు చేరింది. రిజర్వాయర్ సామర్థ్యం సుమారు ఒక టిఎంసి కాగా, ఆ స్థాయికి నీటి నిల్వలు చేరాయి. ఆ నీరు మొత్తం ప్రస్తుతం ఖాళీ అయ్యాయి. గతంలో టిడిపి హయాంలో నీరు-చెట్టు పథకం కింద రాయల చెరువులో పనులు జరిగాయి. ఈ పనుల్లో అప్పట్లో అవినీతి జరిగిందని, అందువల్లే ఇప్పుడు ఈ చెరువుకు గండిపడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీగా ఆస్తి నష్టం

ఊహించని వరదతో ఈ గ్రామాల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ గ్రామాల్లోని వారు పాడి పశువులను ఎక్కువగా పెంచుతున్నారు. పెద్ద సంఖ్యలో పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల మందలు రైతుల కళ్లెదుటే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు చెబుతున్నారు. పశువులు ఆయా గ్రామాల్లోని మృతి చెంది బురద నీటిలో పడి మిగతా 2లో

నష్టపోయిన కౌలు రైతులందరికీ తుఫాను పరిహారం

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నష్టపోయిన కౌలు రైతులందరికీ తుఫాను పరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇ- క్రాప్ నమోదుతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా వాస్తవ సాగుదారులను గుర్తించి నష్టపోయిన కౌలు రైతులందరికీ పరిహారం అందించాలని కోరారు. ఇ-క్రాప్ నమోదు చేసుకున్న వారికే తుఫాను సహాయం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం వల్ల అత్యధికమంది కౌలుదారులు నష్టపోతున్నారని తెలిపారు. దరఖాస్తులు పెట్టుకున్న వారికి కూడా నిరాకరిస్తున్నారని, ప్రభుత్వ దరఖాస్తు ఫారంలో వాస్తవ సాగుదారు అనే కాలమ్ ఉన్నప్పటికీ చాలాచోట్ల ఉద్యోగులు దానికి రికార్డు చేయడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల కౌలుదారులకు నష్టం జరుగుతుందని, పెట్టుబడి పెట్టి నష్టపోయిన కౌలుదారులకు బదులుగా ఏ పెట్టుబడి పెట్టని భూయజమానికి నష్టపరిహారం చెల్లించడం అన్యాయమని తెలిపారు. ఆ పేరుతో కౌలుదారులకు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని వివరించారు. ఎన్యూమరేషన్ పూర్తయిందని, ప్రకటించడంతో కౌలు రైతులు నిరాశ చెందారని వివరించారు. ఇప్పటికి జరిగిన నష్టంతో బేజారయిన కౌలు రైతులకు ఇది ఆశనిపాతమని పేర్కొన్నారు. కౌలు రైతులతోపాటు అనేకమంది పేద, మధ్యతరగతి రైతుల నష్టం వివరాలను కూడా నమోదు చేయలేదని తెలిపారు. రైతుల ఆందోళనతో మరో రెండు రోజులు ఎన్యూమరేషన్ గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ దశలోనైనా కౌలుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. కౌలు రైతులు ప్రభుత్వ నిర్ణయంతో నిరాశ పడకుండా దరఖాస్తులు పెట్టుకుని పరిహారం కోసం పోరాడాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో లెఫ్ట్ ప్యానెల్ ఘన విజయం

ఎబివిపికి చావుదెబ్బ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాల ప్యానెల్ ఘన విజయం సాధించింది. సెంట్రల్ ప్యానెల్‌లో ఉన్న నాలుగు ప్రధాన పోస్టులను లెఫ్ట్ ప్యానెల్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బిజెపి అనుబంధ ఎబివిపికి చావుదెబ్బ తగిలింది. సిట్టింగ్ జాయింట్ సెక్రటరీ స్థానాన్ని కూడా కోల్పోయింది. జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలు ఈ నెల 4న జరిగాయి. ఆ రోజు నాలుగు సెంట్రల్ ప్యానెల్ పోస్టులతోపాటు, 42 కౌన్సిలర్ల పోస్టులకు పోలింగ్ జరిగింది. 67 శాతం ఓటింగ్ జరిగింది. మంగళవారం రాత్రి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగగా, గురువారం సాయంత్రానికి తుది ఫలితాలు వెల్లడయ్యాయి. నాలుగు సెంట్రల్ ప్యానెల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులనూ లెఫ్ట్ యూనిటీ (ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ, డిఎస్ఎఫ్) సొంతం చేసుకుంది. ఎబివిపి తుడిచిపెట్టుకుపోయింది.

విజేతలు వీరే...

జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలిగా లెఫ్ట్ ప్యానల్ తరపున పోటీ చేసిన అదితి మిశ్రా (1,937), ఎబివిపి అభ్యర్థి వికాస్ పటేల్ (1,488)పై 449 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షురాలిగా లెఫ్ట్ ప్యానల్ తరపున పోటీ చేసిన కిజాకూట్ గోపిక బాబు (3,101), ఎబివిపి అభ్యర్థి తాన్య కుమారి (1787)పై 1,314 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా లెఫ్ట్ ప్యానల్ తరపున పోటీ చేసిన సునీల్ యాదవ్ (2005), ఎబివిపి అభ్యర్థి రాజేశ్వర్ కాంత్ దూబె (1,901)పై 104 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా లెఫ్ట్ ప్యానల్ తరపున పోటీ చేసిన డానిష్ అలీ (2,083), ఎబివిపి అభ్యర్థి అనుజ్ దమరా (1,797)పై 286 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వామపక్ష కూటమి మూడు ఐసి స్థానాలను, చాలా కౌన్సిలర్ పదవులను గెలుచుకుంది. అందులో ఒక ఐసి స్థానాన్ని, ఏడు కౌన్సిలర్ స్థానాలను ఎస్ఎఫ్ఐ గెలుపొందింది. తొమ్మిది స్థానాల్లో పోటీ చేసిన ఎస్ఎఫ్ఐ ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. సెంట్రల్ ప్యానెల్‌లో ఎస్ఎఫ్ఐ అభ్యర్థి కిజాకూట్ గోపిక బాబు అత్యధిక మెజారిటీని సొంతం చేసుకుంది. జెఎన్‌యు విశ్వవిద్యాలయాన్ని నాశనం చేయడానికి ఆర్ఎస్ఎస్ చేసిన ప్రయత్నాలకు ప్రతిఘటన అని ఎస్ఎఫ్ఐ జెఎన్‌యు కార్యదర్శి పి.పార్వతి అన్నారు. గత సంవత్సరాల్లో ఎబివిపి ఆధిపత్యం చెలాయించిన విద్యాసంస్థల్లో కూడా వామపక్ష కూటమి విజయం సాధించడం దీనికి ఉదాహరణ అని ఆమె అన్నారు.

జెఎన్‌యు విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ శుభాకాంక్షలు

జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలలో సంఘ్ పరివార్ మతతత్వ, విభజన రాజకీయాలను నిర్ణయాత్మకంగా తిరస్కరించినందుకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ శుభాకాంక్షలు తెలిపింది. గురువారం ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీలో ఎస్ఎఫ్ఐ విజయభేరి

7

బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎకు శృంగభంగం తప్పదు

ఓట్ల తొలగింపుపై అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహం

- రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాలను మోడీ అమలు చేయలేదు
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శ

మీడియాతో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

బీహార్‌లో మొదటి దశ ఎన్నికలు ప్రారంభమయ్యాయని, ప్రజలు ఉత్సాహంగా వచ్చి ఓట్లు వేస్తున్నారని, భారీ స్థాయిలో పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని, బీహార్ ఎన్నికలు రాబోయే రాజకీయ పరిణామాలకు దిక్సూచిగా ఉంటాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు తెలిపారు. గురువారం ఆయన ఏలూరు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. బీహార్ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. ఎన్నికల్లో ఎన్‌డిఎకు శృంగభంగం తప్పదన్నారు. దేశంలోనూ, బీహార్‌లోనూ ఎన్‌డిఎ అన్ని రంగాల్లోనూ పూర్తిగా విఫలమైందని వివరించారు. ఎస్ఐఆర్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించి గెలవాలని తీవ్ర ప్రయత్నం చేసిందని, ప్రజలు దీన్ని అర్థం చేసుకుని తిప్పికొట్టారన్నారు. సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని ఆధార్ కార్డును ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పిందని గుర్తు చేశారు. ఓట్ల తొలగింపు వ్యవహారంపై బీహార్ ప్రజలు పోరాడి తమ హక్కులను సాధించుకున్నారన్నారు. ఎన్‌డిఎ కుట్రను ముందుగానే భగ్నం చేశారని తెలిపారు. ప్రజల్లో వస్తోన్న స్పందన, ర్యాలీలకు జనం వస్తున్న తీరు చూస్తే ఎన్‌డిఒ ఓటమి ఖాయమన్నారు. ఒపీనియన్ పోల్స్ పేరుతో కార్పొరేట్ మీడియా ప్రజల నాడిని కాకుండా కృత్రిమ సృష్టి చేస్తోందన్నారు. బీహార్ ప్రజలు కసిగా ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ తీరును రాష్ట్రాలు అనేక సందర్భాల్లో ప్రతిఘటించాయన్నారు. ఈ ప్రతిఘటనకు టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ నాయకత్వం సైతం వహించారని గుర్తు చేశారు. అలాంటిది ఎన్‌టిఆర్ ఫొటో పెట్టుకుని చంద్రబాబు, చే గువేరా ఫొటో పెట్టుకుని పవన్‌కల్యాణ్ ఎన్‌డిఎకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో విద్యుత్ సంస్కరణలకు సంబంధించి చట్టాలు తీసుకొస్తున్నారన్నారు. దీంతో, విద్యాలయాలు, గృహవినియోగదారులు, ఆస్పత్రుల వంటివాటికి పెద్ద దెబ్బ తగలనుందని తెలిపారు. వీటికి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని, ఇది సరికాదని, ప్రజల తరపున నిలబడి పోరాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎపికి చేసిన వాగ్దానాలను అమలు చేయలేదని వివరించారు. పోలవరం, అమరావతికి నిధులు ఇవ్వడం లేదన్నారు. అమరావతి నిధుల కోసం సింగపూర్ చుట్టూ చంద్రబాబు తిరుగుతున్నారని తెలిపారు. ఎపికి గూగుల్ డేటా సెంటర్ రావడం మంచిదేనని, అయితే, ఇంతగా గొప్పలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. మహా అయితే డేటా సెంటర్‌లో 300 ఉద్యోగాలు వస్తాయని, దీనికి ఇంత అట్టహాసం అవసరం లేదని తెలిపారు. డేటా సెంటర్‌కు ఇచ్చే భూమి, అయ్యే ఖర్చుకు తగ్గ ప్రతిఫలం ఉండదన్నారు. ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో అంతే ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆర్థిక మాద్యం కొనసాగుతుండడంతో విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికే కాదు... దేశంలోకీ రావడం లేదన్నారు. పెట్టుబడుదారులు షేర్ మార్కెట్లో డబ్బులు పెడుతున్నారని, లేదా దాచుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు ఉపాధి రంగంలో ఎక్కడ వచ్చాయో చెప్పాలని లోకేష్‌ను ప్రశ్నించారు.

రాష్ట్రంలోనూ ఎస్ఐఆర్!

- వచ్చే ఏడాది నిర్వహణ
- కలెక్టర్లతో సిఇఒ వివేక్ వీడియోకాన్ఫరెన్స్

2

అదరగొట్టిన ఎల్ఐసి

- క్యూ2 లాభాల్లో 32% వృద్ధి
- ఆస్తులు రూ.57.23 లక్షల కోట్లకు చేరిక

3

వన్ విజన్-వన్ డైరెక్షన్

- ఇదే ప్రభుత్వ విధానం
- విజన్ యూనిట్లుగా సచివాలయాలు
- 'డేటా ఆధారిత పాలన' పై సిఎం చంద్రబాబు

'డేటా ఆధారిత పాలన' సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'వన్ విజన్- వన్ డైరక్షన్' అన్నదే తమ ప్రభుత్వ విధానమని, దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సింగిల్ టీమ్, సింగిల్ అప్రోచ్, సింగిల్ థీమ్‌తో అంతా పని చేద్దామన్నారు. గ్రామ సచివాలయాలను విజన్ యూనిట్‌లుగా మార్చుకుని, సమర్థవంతంగా వాటిని వినియోగించుకోవాలని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ దిశగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలన్నారు. ప్రస్తుతం డేటా ఆధారిత పాలన అత్యంత కీలకంగా మారిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామన్నారు. అంగన్వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలన్నారు. అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు డేటా లేక్ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు.

కేంద్రం తీసుకువచ్చిన డిజి లాకర్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తున్నప్పుడు మళ్లీ ప్రజల్ని కార్యాలయాలకు రప్పించడం ఎందుకన్నది ఆలోచించాలన్నారు. రెవెన్యూ శాఖ సహా ఇతర అన్ని శాఖలు సేవలు వీలైనన్ని ఆన్‌లైన్‌లో లేక వాట్సాప్ గవర్నెన్స్‌లో అందాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు.. వాటికి గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యంత్రాంగం అందించే నాణ్యమైన సేవలతోనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఏఐ వాటితే జిఒల ద్వారా లిటిగేషన్లురాకుండా నివారించవచ్చున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులు హాజరవ్వగా, వర్చువల్‌గా జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు హాజరయ్యారు.

బీహార్ తొలి విడతలో 64.46 శాతం పోలింగ్

- ఉప ముఖ్యమంత్రికి చేదు అనుభవం
- సిపిఎం అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యేపై దాడి
- మార్పు రావాల్సిందేనన్న లాలూ
- ఓట్ల చౌర్యాన్ని యువతే అడ్డుకోవాలన్న రాహుల్

పాట్నాలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్, రబ్రీదేవి, తేజస్వి యాదవ్

పాట్నా : చెదురు మదురు ఘటనల మధ్య బీహార్‌లో తొలి విడత పోలింగ్ గురువారం ముగిసింది. 64.46శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు ఆరంభంలోనే తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయకుమార్ సిన్హా కాన్వాయ్‌ను ఆర్‌జెడి శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఆర్‌జెడి శ్రేణులను చెదరగొట్టారు. మాంజిలో సిపిఎం అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సత్యేంద్ర యాదవ్‌పై దాడి జరిగింది. హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడియు నేత ప్రభునాథ్ సింగ్ కుమారుడు అనుచరులు దాడికి పాల్పడ్డారు. వారి దాడిలో సత్యేంద్ర యాదవ్ ప్రయాణిస్తున్న కారు అద్దాలు పగిలాయి. దాడులు కొత్త కాదని, ప్రతిఘటిస్తామని సిపిఎం నేతలు స్పష్టం చేశారు.

రెండు సంకీర్ణాలోని చిన్న పార్టీలకు ఈ దశ పోలింగ్ కీలకంగా వుంది. సిపిఐ(ఎంఎల్) పోటీచేసే 20 సీట్లలో 10 సీట్లు తొలి దశలోనే వున్నాయి. వాటిలో ఆరింట్లో సిట్టింగ్ సభ్యులున్నారు. సిపిఎం బరిలో ఉన్న మాంజి, విభూదిపూర్, అగడాట్ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. ఇక ఎన్‌డిఎలో లోక్‌జనశక్తి (రాం విలాస్) పార్టీ పోటీ చేసే 29 సీట్లలో 10 స్థానాల్లో గురువారం పోలింగ్ జరిగింది. పాట్నా జిల్లాలోని దానాపూర్ దియారా ప్రాంతవాసులు అక్కడ వరదల కారణంగా బోట్లలో వెళ్లి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తొలి గంటల్లోనే ప్రముఖుల ఓటింగ్

తొలిదశలో 121 స్థానాల్లో ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకల్లా ముగిసింది. ఐదు నియోజకవర్గాల్లో భద్రతా కారణాలతో 5 గంటలకే ముగిసింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ భక్తియార్‌పూర్‌లో ఓటు వేశారు. మరోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, బిజెపి ఎంపి మిగతా 2లో



సెల్‌ఫోన్ లైట్ సాయంతో చికిత్స చేస్తున్న సిబ్బంది

అంధకారంలో కెజిహెచ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్‌లో గురువారం సాయంత్రం నుంచి అంధకారం అలుముకుంది. ఆసుపత్రిలోని చాలా విభాగాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్త్రీల వార్డులో పరిస్థితి దయనీయంగా మారింది. జనరేటర్లు అక్కడక్కడా పనిచేసినా చికిత్సలు ముందుకు సాగలేదు. సెల్‌ఫోన్ టార్చ్ వెలుగుల్లోనే నర్సులు సేవలు అందించారు. ఉక్కబోతతో రోగులు పడ్డ బాధలు వర్ణనాతీతం. అధికారులు, ప్రభుత్వం నుంచి ప్రత్యామ్నాయ చర్యలు కొరవడ్డాయి. ఈ ఏడాది ఆగస్టులోనూ ఇటువంటి పరిస్థితే ఎదురైంది. ఆసుపత్రి సిఎస్ఆర్ బ్లాక్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ ఘటన నుంచైనా అధికారులు పాఠాలు నేర్వలేదు.

వేతనాల పెంపు కోసం కాఫీ కార్మికుల సమ్మె

3

అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై విధాన పత్రం విడుదల చేయాలి

- దళిత, గిరిజన, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ తీర్మానం
- విద్యా, వైజ్ఞానిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- డిఎస్ఎంఎం జాతీయ నేత వి.శ్రీనివాసరావు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, పక్కన మాల్యాద్రి తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణపై టిడిపి కూటమి ప్రభుత్వం విధాన పత్రం విడుదల చేయాలని కోరుతూ దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. స్మృతివనం నిర్వహణకు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని, అభివృద్ధి కమిటీలో అధికారులతోపాటు పౌర సంస్థల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. స్మృతివనానికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేయాలని, దీనిని వ్యాపార దృష్టితో కాకుండా పర్యాటక ప్రదేశంగా చూడాలని కోరుతూ దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు మాట్లాడారు. నిధులు మంజూరు చేసి విద్యా, వైజ్ఞానిక భాండాగారంగా స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సమగ్ర ప్రణాళికను ప్రకటించాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విషయంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. మాల్యాద్రి మాట్లాడుతూ... అంబేద్కర్ స్మృతివనం నిర్వహణలో పౌర సంస్థలను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. జై భీమ్ భారత్ పార్టీ అధికార ప్రతినిధి వై.కొండలరావు మాట్లాడుతూ... ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం నాడు 'చలో డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం'నకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమతా సైనిక్ దళ్ మహిళా రాష్ట్ర అధ్యక్షులు శ్వేత మాట్లాడుతూ.. స్మృతివనం పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలన్నారు. దళిత, అభ్యుదయ సంఘం నాయకులు వై.నరసింహారావు మాట్లాడుతూ... స్మృతివనం నిర్వహణను టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. విగ్రహ నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.క్రాంతికుమార్ మాట్లాడుతూ...స్మృతివనం అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ఐక్యంగా పోరాడాలన్నారు. దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు కె.ప్రభాకరరావు, పి.నాగకుమార్, రవిబాబు, నాగేశ్వరరావు, ఎంవి.ఆంజనేయులు, జి.నటరాజు తదితరులు మాట్లాడారు. స్మృతివనం అభివృద్ధిపై మంత్రులు, అధికారులకు ఐక్యంగా వినతిపత్రాలు అందజేయాలన్నారు.

ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా కైవల్య రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - నిడదవోలు (తూర్పు గోదావరి)

అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ 2029లో చేపట్టబోయే అంతరిక్షయాత్రలో పాల్గొనేందుకు ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కైవల్యరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు తమకు సమాచారం వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్ట్రోనాట్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ చాలా క్లిష్టతరమైనదని, కఠినమైన ఇంటర్వ్యూ ప్రక్రియ అనంతరం ఆమె ఎంపికైనట్లు తెలిపారు. టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ నాలుగేళ్ల కఠినమైన ఆస్ట్రోనాట్ శిక్షణను కైవల్యకు అందించనున్నారు. నాసాలో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన, 224 రోజులు అంతరిక్షంలో గడిపి, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కమాండర్‌గా ఆరు నెలలు సేవలందించిన నాసా వెటరన్ ఆస్ట్రోనాట్ టిఎస్ఐ ఛీఫ్ ఆస్ట్రోనాట్ విలియం బిల్‌మెక్ ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి టిఎస్ఐ డిప్యూటీ ఛీఫ్ ఆస్ట్రోనాట్ మార్కోస్ పోంటెస్, వంటి అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ పొందనుందన్నారు. తనను ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపిక చేసిన టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్‌కు కైవల్య రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో దేశం గర్వించదగిన వ్యోమగామిగా, ఖగోళ శాస్త్రవేత్తగా సేవలందిస్తానని ఆమె తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

కొత్త టీచర్ల సెలవులపై స్పష్టత ఇవ్వాలి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్సి-2025 ఉపాధ్యాయులకు సెలవులపై స్పష్టత ఇవ్వాలని,లీప్ యాప్‌లో సెలవులను పొందుపరచాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. వీరికి అక్టోబర్ 3 నుంచి వేతనాలు చెల్లించే విధంగా ఎస్‌టిఓలకు ఆదేశాలు జారీ చేయాలని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసులు, టి చందనరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఎన్ఆర్ఐల కృషి అభినందనీయం

- లండన్‌లో పర్యాటక శాఖమంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఎన్ఆర్ఐల కృషి అభినందనీయమని పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. లండన్ పర్యటనలో భాగంగా ఆయన జనసేన నేతల ఆత్మీయ సమావేశంలో గురువారం పాల్గొన్నట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఎన్ఆర్ఐలు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, మాతృభూమి అభివృద్ధికి తోడ్పడటం, వివిధ రంగాల్లో ప్రతిభను చాటడం, సాంస్కృతిక అనుబంధాన్ని బలోపేతం చేయడంలో వారి పాత్ర అమోఘమని చెప్పారు. రాష్ట్రాన్ని పరిపాలించిన గత దుర్మార్గమైన ప్రభుత్వాన్ని, నియంతృత్వ ధోరణిలో ఉన్న ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపామని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని మంత్రితో ఎన్ఆర్ఐలు చెప్పారు.

నూరుశాతం రెవెన్యూ వసూళ్లు

- సిపిడిసిఎల్ సిఎండి పుల్లారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెవెన్యూ కలెక్షన్లు నూరుశాతం సాధించాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటేడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. పిఎం సూర్యఘర్, రెవెన్యూ వసూళ్లు, తుఫాన్ వల్ల జరిగిన నష్టం, ఆర్‌డిఎస్ఎస్‌లపై విజయవాడలోని సిపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్ఇలతో గురువారం సమీక్ష నిర్వహించారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, టివిఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వరర్లు, సిజిఎం లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి : నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కీలక ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై గురువారం వెలగపూడి సచివాలయంలో అధికారులు, కాంట్రాక్టు కంపెనీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు చేపట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను సైతం జగన్ నిలిపేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. బిఆర్ఆర్ వంశధార, తోటపల్లి, వంశధార నాగావళి లింక్, జంఝావతి రిజర్వాయర్, హీరమండలం లిఫ్ట్, నాగావళి, చంపావతి, మహేంద్రతనయ, తారకరామతీర్థసాగర్, మద్దులవలస రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టులను పూర్తి చేసేలా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 1.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రావడంతోపాటు మరో 2.48 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని గుర్తించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, గత వైసిపి ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని విధ్వంసం చేస్తే కూటమి ప్రభుత్వం చివరి ఎకరం వరకూ సాగునీరు అందించేలా గాడిలో పెడుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ సలహాదారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనూ ఎస్ఐఆర్!

- వచ్చే ఏడాది నిర్వహణ
- కలెక్టర్లతో సిఇఒ వివేక్ వీడియోకాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్య పునాదులకే చేటు చేస్తుందని సర్వత్రా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు రాష్ట్రంలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా గురువారం నాడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వచ్చే ఏడాది ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారయంత్రాంగం ఆ కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. కలెక్టర్లు వారి పరిధిలోని ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, బిఎల్ఒలు, సూపర్‌వైజర్లకు సమగ్ర శిక్షణను నిర్వహించాలని సూచించారు. బిఎల్ఒలకు ఐడి కార్డుల పంపిణీని వారం రోజుల్లోపు పూర్తి చేయాలని 'బుక్ ఎ కాల్ విత్ బిఎల్ఒ' మాడ్యుల్‌లో స్వీకరించిన అన్ని అభ్యర్థనలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో 21 ఏళ్ల కిందట 2002లో ఎస్ఐఆర్ నిర్వహించారని తెలిపారు. ఓటర్లు తరచూ వలసలు వెళ్లడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదు చేసుకోవడం, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించకపోవడం, విదేశీయులను పొరపాటుగా జాబితాలో చేర్చడం వంటి కారణాలతో ఎస్ఐఆర్ చేపట్టాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారుల పాత్రను ఆయన ఈ సందర్భంగా వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి కొత్త పోలింగ్ కేంద్రాల అవసరాన్ని అంచనా వేయాలని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్ల ఉండకుండా చూడాలన్నారు. 2025 ఓటర్ల జాబితాలోని ఓటర్లను చివరి ఎస్ఐఆర్ రోల్ అయిన 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయడాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల తల్లి లేక తండ్రి పేరు చివరి ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో ఉన్నట్లయితే, ఆ ఓటర్ల జాబితా స్వీయ సమగ్ర పత్రంగా పరిగణించబడుతుందన్నారు. ఇసిఐ వెబ్ పోర్టల్ లో 'బుక్ ఎ కాల్ విత్ బిఎల్ఒ' అనే మాడ్యూల్‌ను ప్రవేశపెట్టిందని వెల్లడించారు. ఇది పౌరులు తమ ఓటర్ల జాబితా సంబంధిత సమస్యలను 48 గంటల్లోగా పరిష్కరించుకోవడానికి బిఎల్ఓతో కాల్స్ బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుందన్నారు.

దగ్ధమైన బస్సును పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవ్ రెడ్డి

'మన్యం'లో ఒడిశా ఆర్‌టిసి బస్ దగ్ధం

ప్రజాశక్తి-పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా), చింతలపూడి (ఏలూరు జిల్లా)

తెలుగు రాష్ట్రాల్లో బస్సు ప్రమాదాలు తారెత్తుస్తున్నాయి. రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లాలో బస్సు దగ్ధమవ్వగా.. ఏలూరు జిల్లాలో బస్సు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలు గురువారం చోటు చేసుకున్నాయి. పోలీసులు, స్థానికుల సమాచారం ప్రకారం..విజయనగరం నుంచి జైపూర్‌కు వెళ్తున్న ఒడిశా ఆర్‌టిసి బస్సు పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం రొడ్డవలస జంక్షన్ సమీపంలో దగ్ధమైంది. పదిమంది ప్రయాణికులతో బస్సు ఉదయం 7.30 గంటల సమయంలో రొడ్డవలస జంక్షన్ సమీపాన ఘాట్ రోడ్డు వద్దకు చేరుకునేసరికి ఒక్కసారిగా ఇంజన్‌లో పొగ రావడంతో డ్రైవర్, కండాక్టర్ అప్రమత్తమై ప్రయాణికులను బస్సులో నుంచి దించేశారు. కొన్ని క్షణాల్లోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సమయస్ఫూర్తిగా వ్యవహరించిన బస్సు డ్రైవర్‌ను మన్యం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అభినందించారు.

ఏలూరులో..

ఏలూరు నుంచి చింతలపూడి మీదుగా సత్తుపల్లి వెళ్లేందుకు గురువారం ఉదయం ఆర్‌టిసి బస్సు సుమారు 30 మంది ప్రయాణికులతో బయల్దేరింది. లింగపాలెం మండలం జూబ్లీ నగర్ వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న మరో బస్సును ఓవర్‌టేక్ చేయబోతూ ఈ బస్సు అదుపు తప్పి పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. బస్సు ముందుభాగం దెబ్బతిన్నది. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేశారు. దీంతో సమీప ప్రజలు అక్కడకు చేరుకుని బస్సులో ప్రయాణికులను కిందకు దించారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పత్తి రైతుల సమస్యలను పరిష్కరించండి

- కేంద్రానికి లేఖ రాసిన మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు, ఆయన గురువారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కాపాస్ కిసాన్ యాప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చిన సిఎం యాప్‌తో అనుసంధానించడం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులు పత్తి విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. తుఫాను కారణంగా పత్తి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాపాస్ కిసాన్ యాప్ నుంచి సిఎం యాప్‌కు రైతుల వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షానికి తడిసి రంగు మారిన పత్తిని కూడా తగిన ధర తగ్గింపులతో కొనుగోలు చేయాలని కోరారు

ఉల్లి రైతులకు ఆందోళన వద్దు

రాష్ట్రంలో ఉల్లి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఉల్లి ధరల పతనమైనప్పుడు రైతుల శ్రమ వృధా కాకుండా ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలో ఉల్లిని కొనుగోలు చేసిందని గురవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమయంలో రూ.18 కోట్ల విలువైన ఉల్లిని కర్నూలులో ప్రభుత్వం సేకరించిందని, ఇప్పటికే రూ.10 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.8 కోట్లను అతి త్వరలోనే రైతులకు అందజేస్తామన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఎపి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఎపి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు తొలి సమావేశం సచివాలయంలో గురువారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో అపారమైన అవకాశాలను కలిగి ఉందన్నారు. 974 కిలో మీటర్ల పొడవైన తీరప్రాంతం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూలమని చెప్పారు. ఇప్పటికే కర్నూలులో 1 గిగావాట్ సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశామని తెలిపారు. విశాఖ సమీపంలోని పూడిమడక వద్ద ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జిఇఎల్) రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో 20 గిగావాట్ పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంతో రోజుకు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రాజెక్టును రూపొందిస్తోందని పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల విదేశీ దిగుమతులు తగ్గి స్థానిక వినియోగం పెరుగుతుందని వివరించారు. నీతిఆయోగ్ సభ్యుడు, అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ వికె సరస్వత్ మాట్లాడుతూ బయోమాస్ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. బయోమాస్ ఆధారంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రైతుల ఆదాయాన్ని పెంచడంలో, ఉపాధి అవకాశాలు విస్తరించడంలో తోడ్పడుతుందని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్‌ను స్టీల్ ప్లాంట్లు, ఎరువుల పరిశ్రమలు, ఓడరేవుల్లో వినియోగించుకోవాలని సూచించారు.

విరుచుకుపడ్డ విపత్తు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. వాటిని చూసి పెంపకందార్లు జీవనాధారాన్ని కోల్పోయామంటూ కన్నీరు మున్నీరయ్యారు. పంట పొలాలను వరద నీరు ముంచెత్తడం, పొలాల్లో బురద పేరుకుపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో ఇసుక, బురద మేటలు ఏర్పడ్డాయి. ఈ ఐదు గ్రామాల్లోని బీడీ కార్మికుల, మత్స్యకారుల ఇళ్లలోంచి బీడీ తయారీ సామగ్రి, వలలు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇళ్లల్లోకి భారీ ఎత్తున వరద నీరు, బురద చేరింది. ఆస్తి నష్టం కోట్ల రూపాయల్లోనే ఉంటుందని బాధితులు వాపోయారు.

కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

రాయలచెరువుకు గండితో ఖాళీ అయిన రిజర్వాయర్ నీరు ఐదు గ్రామాలను ముంచెత్తి అనంతరం గాజుల కండ్రిగ ఏటిగుండా కాళంగి రిజర్వాయర్‌కు చేరింది. దీంతో, కాళంగి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరడంతో అధికారులు గేట్లను ఎత్తివేసి నీటిని కిందికి వదిలారు. మునక గ్రామాల నుంచి వరదలో కొట్టుకొచ్చిన పశువులు, మేకల కళేబరాలు కాళంగి జలాశయంలో కనిపించాయని అక్కడి గ్రామస్తులు తెలిపారు.

కళత్తూరు హరిజనవాడ గ్రామంలో రోడ్డుపై చేరిన వరద నీరు

సహాయక చర్యలు ముమ్మరం

రాయలచెరువుకు గండి పడిన విషయం తెలుసుకున్న అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. తిరుపతి ఎస్‌పి సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డిఒ భాను ప్రకాష్ రెడ్డి, ఎన్‌టిఆర్ఎఫ్ బందాలతో కలిసి మునక గ్రామాల్లో పర్యటించారు. బురద, వరద నీటిని తొలగించేందుకు ప్రయత్నించారు. బాధితులకు ఆహార పొట్లాలు అందజేశారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి నేరుగా కెవిబి పురం చేరుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సహాయక చర్యలు పర్యవేక్షించారు. మృతి చెందిన పశువులను వాహనాల్లో తరలించారు. ఆస్తి, ప్రాణ నష్టాలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మునక గ్రామాలను పరిశీలించారు.

కుటుంబానికి రూ.లక్ష చొప్పున తక్షణ సాయం అందించాలి : వ్యకాసం

రాయల చెరువు ఘటనలో మునకకు గురైన గ్రామాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ పరిశీలించారు. ఊహించని వరద మిగిల్చిన నష్టాన్ని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల్లో పాడి రైతులు, రైతులు, బీడీ కార్మికులు, మత్స్యకారులు అధికంగా ఉన్నారని, వీరంతా భారీ స్థాయిలో ఆస్తులు కోల్పోయారని తెలిపారు. ఆవుకు రూ.50 వేలు, బర్రెకు రూ.60 వేలు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా లక్ష రూపాయలు ఇవ్వాలని కోరారు. నీరు-చెట్టులో జరిగిన అవినీతి కారణంగానే నేడు రాయలచెరువుకు గండి పడిందని విమర్శించారు.

విజయ డెయిరీ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య కన్నుమూత

ప్రజాశక్తి - ఉంగుటూరు, మొవ్వ

విజయ డెయిరీ (కృష్ణా మిల్క్ యూనియన్) మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య (94) గురువారం తెల్లవారుజామున మరణించారు. వయోభారంతో కృష్ణా జిల్లా గన్నవరం మండలం అల్లాపురం రిషి వాటికలో తన నివాసంలో కన్నుమూశారు. ఆయన భార్య ఆరేళ్ల క్రితం చనిపోయారు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన స్వగ్రామం కృష్ణా జిల్లా మొవ్వం. కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడి (విజయ డెయిరీ చైర్మన్)గా ఏకగ్రీవంగా 27 ఏళ్లపాటు జానకిరామయ్య సేవలందించారు. ఐదేళ్లపాటు ఉమ్మడి రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్ చైర్మన్‌గా పని చేసి అత్యుత్తమ సేవలందించారు. 2019లో ప్రతిష్టాత్మకమైన డాక్టర్ కురియన్ అవార్డును అందుకున్నారు. ఈ గౌరవం తర్వాత ఆయనను 'ఆంధ్ర కురియన్'గా పేరుగాంచారు. 1981లో మొవ్వ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సాయంత్రం అల్లాపురం స్మశానవాటికలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎస్ఆర్ఎంయు ఘటనపై విచారణ కమిటీ

- గుంటూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - మంగళగిరి, మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

అమరావతి రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఫుడ్‌పాయిజనింగ్‌పై విచారణ కమిటీని నియమిస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో తెనాలి సబ్‌కలెక్టర్, ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, ఆహార తనిఖీ అధికారి, మంగళగిరి డిఎస్‌పి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఉన్నారు. వర్సిటీలో ఆహార నాణ్యతపై క్షుణ్ణంగా విచారణ చేసి నివేదించాలని కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయాన్ని గురువారం కమిటీ సందర్శించి విచారణను ప్రారంభించింది. అనంతరం తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా మీడియాతో మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో దాదాపుగా 300 మంది అస్వస్థత గురైనట్టుగా గుర్తించామన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత లోపం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. వారిలో కొంతమందికి డయేరియా లక్షణాలు, కడుపునొప్పితో వాంతులు విరోచనాలతో అస్వస్థత గురయ్యారని తెలిపారు. రాజధాని గ్రామాల నుంచి వస్తున్న తాగునీటి వల్ల ఇబ్బంది ఏర్పండిందా? అనే కోణంలో విచారణ చేపట్టామన్నారు. నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు.

17 రోజులు సెలవులు

శుక్రవారం నుండి 23 వరకూ సెలవులను ప్రకటిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులిచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీ అంతటా సమగ్ర శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెస్‌తో పాటు వంట గదులు, హాస్టళ్లు మొత్తం పరిశుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు..

విద్యార్థులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ ప్రదర్శన

ఆహారం నాణ్యత లేకపోవడంపై యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. విద్యార్థులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో గురువారం ప్రదర్శన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 300 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీల్లో భోజనం సరిగా లేదని మూడు నెలలుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రూ.లక్షల ఫీజులు చెల్లిస్తున్నా వారికి మంచి ఆహారం పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులతో ముచ్చట్లు చెప్పడానికే కాదని, వారి సమస్యలు వినేందుకూ అధికారులు, మంత్రులు వెళ్లాలని కోరారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా రాజధానిలో వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.పవన్ కుమార్, ఎస్‌కె.సమీర్, సహాయ కార్యదర్శి బి.సౌమ్య, నాయకులు రాజశేఖర్, వంశీ, మున్నా, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

బీహార్ తొలి విడతలో 64.46 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

రవిశంకర్ ప్రసాద్, ఆయన సతీమణి మాయా శంక పాట్నాలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో ఓటు వేశారు. కేంద్రమంత్రి, ఎల్‌జెపి-రాం విలాస్ పార్టీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ ఖగారియాలో ఓటు వేశారు. మాజీ సిఎం, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్, ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు, మహాగట్ బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ పాట్నాలో ఓటువేశారు. జన్‌శక్తి జనతాదళ్ (జెజెడి) జాతీయ అధ్యక్షుడు, లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పాట్నాలో ఓటువేశారు.

బీహార్‌లో అధికార జెడియు గూండాల దాడిలో దెబ్బతిన్న సిపిఎం అభ్యర్థి డాక్టర్ సత్యేంద్ర యాదవ్ వాహనం

ఉప ముఖ్యమంత్రికి చేదు అనుభవం

లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాకు చేదు అనుభవం ఎదురైంది. ఓటు వేసి వెళుతున్న ఆయన వాహనాన్ని ఆర్‌జెడి మద్దతుదారులు కొందరు అడ్డుకున్నారు. విజయ్ సిన్హాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓడిపోతానన్న భయంతోనే విజయ్‌కుమార్ సిన్హా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆర్‌జెడి ఎంఎల్‌సి అజయ్‌కుమార్ సింగ్ విమర్శించారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీహార్ డిజిపిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవటానికి అనుమతించబోమని సిఇసి జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు.

నిశితంగా పర్యవేక్షిస్తున్న ఎన్నికల కమిషన్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పై తీవ్ర దుమారం రేగిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ ఎన్నికలను నిశితంగా పర్యవేక్షిస్తోంది. తొలి విడత పోలింగ్ జరుగుతున్న 45వేలకుపైగా పోలింగ్ కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు అందుతున్న సమాచారాన్ని ముగ్గురు కమిషనర్లు పరిశీలిస్తున్నారు. బీహార్‌లో తొలిసారి అన్ని పోలింగ్ బూత్‌ల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, మిగిలిన ఇద్దరు కమిషనర్లు ఎస్.ఎస్.సంధు, వివేక్ జోషి ఢిల్లీ నిర్వాచన్ సదన్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్నట్టు ఇసి వర్గాలు తెలిపాయి.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : లాలూ

బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ అన్నారు. పెనంపై రోటీని ఎప్పటికప్పుడు తిప్పుతూ వుండాల్సిందే లేకపోతే రోటీ మాడిపోతుందని వ్యాఖ్యలు చేస్తూ మార్పు కోసం పిలుపునిచ్చారు. కొత్త బీహార్ సాకారం కావాలంటే తేజస్వి ప్రభుత్వం రావాల్సిన అవసరం వుందని స్పష్టం చేశారు.

ఓట్ల చౌర్యాన్ని ఆపాల్సింది యువతే : రాహుల్

ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఓట్లను కొల్లగొట్టాలని బిజెపి ప్రయత్నిస్తుందని, అలా జరగకుండా అడ్డుకోవాల్సింది యువతేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఇక్కడ ఒక ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బీహార్ యువత ఈ చౌర్యానికి అడ్డుకట్ట వేసి రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత వుందని అన్నారు. పోలింగ్ బూత్‌ల్లో అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందన్నారు.

20 ఏళ్ల దుష్టపాలనకు వ్యతిరేకంగా ప్రజలు మార్పును కోరుతూ ఓటు వేస్తున్నారని కాంగ్రెస్ నేత హరీష్ రావత్ అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, పేలవమైన పాలనా తీరుతో ప్రజలు విసిగిపోయారని అన్నారు.

స్వేచ్ఛగా సక్రమంగా పోలింగ్ జరిగితే

బీహార్ ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరిగినట్టైతే కచ్చితంగా ఎన్‌డిఎ ప్రభుత్వం కూకటి వేళ్లతో పెకలించబడుతుందని ప్రియాంక గాంధీ అన్నారు. ఆ స్థానంలో పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే ప్రభుత్వం వస్తుందన్నారు. ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. దేశాభివృద్ధికి ఇతోధికంగా దోహదపడిన బీహార్ ప్రజలంటే ఎన్‌డిఎకు అసలు గౌరవం లేకుండా పోతోందని అన్నారు.

ఓటు వేయకుండానే వెనక్కి...

కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ, చాలామంది ప్రజలు తమ ఓట్లు లేకపోవడంతో పోలింగ్ స్టేషన్‌లకు వెళ్లి ఓటు వేయకుండానే వెనక్కి రావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పేర్లు ఓటర్ల జాబితాలో లేకపోవడమే కారణమన్నారు. ఓటరు జాబితా లోపభూయిష్టంగా మారిందని వ్యాఖ్యానించారు.

ఎస్‌పిఎఫ్‌లో 264 పోస్టుల భర్తీకి నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పిఎఫ్)లో 264 పోస్టులను రెండు దశల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అనుమతి ఇస్తూ ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. తొలి దశలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో 10 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను (ఎస్‌ఐ), 125 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని, 2027-28లో 9 ఎస్‌ఐ పోస్టులను 120 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. వీటిని డైరెక్ట్ పద్ధతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా చేపడతారు. ఈ పోస్టులకు సంబంధించిన వివరాలు, రోస్టర్ పాయింట్లను బోర్డుకు సమర్పించాలని రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖకు ఆర్థికశాఖ సూచించింది.

ట్రాన్స్‌కో కార్యకలాపాలపై పోటోగ్రఫీ పోటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సరఫరా, ఉద్యోగుల కృషిని ప్రతిబింబించేలా ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో జెఎండి జి సూర్యసాయి ప్రవీణ్‌చంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది, సాధారణ ప్రజానీకం అందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని, ఇందుకోసం సృజనాత్మకతతో కూడిన ఫోటోలను photocontest@aptransco.gov.inకు మెయిల్ చేయాలని సూచించారు. ఈ పోటీలకు సంబంధించిన ఇతర వివరాల కోసం www.aptransco.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు, విద్యుత్ సిబ్బంది కృషిని గుర్తించడమే ఈ పోటీల లక్ష్యమని తెలిపారు.

సంపద సృష్టించేదొకరు.. అనుభవించేది వేరొకరు

- సంపద అందరికీ చేరాలంటే సోషలిజం అనివార్యం
- పెట్టుబడిదారి విధానంలో ప్రజా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావు : బివి రాఘవులు

సదస్సులో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, తాడేపల్లిగూడెం

కార్మికుల, రైతుల, శ్రామికుల కష్టం నుంచి సంపద సృష్టి జరుగుతోందని, ఎటువంటి శ్రమా చేయకుండా విలాసాలు, జల్సాలు చేసేవాళ్లు ఆ సంపదను అనుభవిస్తున్నారని, అందరికీ సంపద చేరాలంటే సోషలిజం అనివార్యమని సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు తెలిపారు. సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా ఏలూరులోని సీతారాం భర్తీయా కల్యాణ మండపంలో 'ప్రపంచ పరిణామాలు - సోషలిజమే పరిష్కారం' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఏలూరు ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం మీదుగా సదస్సు హాలు వరకూ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సదస్సులో బివి.రాఘవులు మాట్లాడుతూ అమెరికాలో న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎన్నికవ్వడం, ప్రపంచవ్యాప్త పరిణామాల నేపథ్యంలో సోషలిజం గురించి మాట్లాడుకోవాలన్నారు. పెట్టుబడిదారీ విధానంలో ప్రజా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావని తెలిపారు. శ్రమ చేసి సంపద సృష్టించేవాళ్లంతా పేదవాళ్లగానే ఉండిపోతున్నారన్నారు. అంబాని వద్ద రూ.17 లక్షల కోట్లు, అదాని వద్ద రూ.16 లక్షల కోట్లు ఆస్తి ఉందని, వీళ్ల ఆస్తులు శ్రామికుల కష్టంతో పెరిగాయని వివరించారు. మోడీ, చంద్రబాబు, కెసిఆర్, రేవంత్‌రెడ్డి అంతా పెట్టుబడిదారుల కోసమే పని చేస్తారని వివరించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసి సబ్సిడీలను ఎత్తివేయాలని చూస్తోందన్నారు. దీనికి చంద్రబాబు, పవన్ తలాడిస్తున్నారని, ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్ ఇచ్చే పరిస్థితి తెస్తున్నారని వివరించారు. సకల సమస్యలకు సోషలిజమే పరిష్కారమన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చైనాలో సోషలిజం, కార్మిక రాజ్యం ఉందన్నారు. దేశంలో కేరళ తీవ్ర పేదరికంపై విజయం సాధించిందని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో ఉందని, పిపిపి విధానం తెచ్చి వారికి ఐదు లక్షల ఎకరాలు కట్టబెట్టాలని చూస్తోందని విమర్శించారు. ఈ సదస్సులో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబూరావు చిత్రపటానికి బివి.రాఘవులు, ఇతర నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, వివిధ కార్మిక సంఘాల జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, ఆర్.రవికుమార్, ఎస్ఎన్.రమేష్, కె.శ్రీనివాస్, విద్యాసాగర్, పి.భారతి, పోశమ్మ, చింతపల్లి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబూరావు ఆశయ సాధనకు కృషి : బివి.రాఘవులు

ఉద్యోగాన్ని, ఉపాధిని వదులుకుని, కార్మికుల కోసం, సోషలిజం కోసం తుదిశ్వాస విడిచే వరకు కట్టుబడి పని చేసిన చింతకాయల బాబూరావు ధన్యజీవి అని బివి.రాఘవులు అన్నారు. బాబూరావు సంస్మరణ సభ గురువారం తాడేపల్లిలోని కాపు కల్యాణ మండపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. తొలుత బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ.. సోషలిజం అనే పనిని బాబూరావు మనకు ఇచ్చి వెళ్లారని, ఆయన ఆశయాన్ని మనందరం ముందుకు తీసుకువెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ... కార్మికులను సమీకరించి, వర్గ పోరాటం చేయడంలో ఏనాడు బాబూరావు రాజీ పడలేదన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బాబూరావు కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సామాజికవేత్త డివిఎస్.వర్మ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి బాబూరావు నిరంతరం పరితపించేవారని కొనియాడారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి ఎల్లప్పుడూ అండగా నిలిచేవారని అన్నారు.

ఆస్పరిలో జీపుజాతాను ప్రారంభిస్తున్న గౌస్‌దేశాయి

తాగు, సాగునీటి కోసం పోరాటం

- సిపిఎం ఆధ్వర్యంలో జీపుజాతాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి, మంత్రాలయం, హాలహర్వి, చిప్పగిరి

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని, అందుకు వేదవతి, నగరడోనా రిజర్వాయర్లు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీపుజాతాలు ప్రారంభమయ్యాయి. ఆస్పరిలో జీపుజాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, మంత్రాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి.నారాయణ ప్రారంభించారు. హాలహర్వి, చిప్పగిరిలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, నాయకులు నారాయణస్వామి, కౌతాళం నుంచి సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య ప్రారంభించారు. ఆస్పరిలో డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆలూరు నియోజకవర్గమని, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆస్పరి మండలాన్ని వేదవతి ప్రాజెక్టు పరిధిలోకి చేర్చి తాగు, సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. పందికోన రిజర్వాయర్ నుంచి ఆస్పరి మండలానికి పైపులైన్ వేసి నీరు తీసుకురావాలన్నారు. ఈనెల 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మంత్రాలయం మండలంలో 15 గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో కెవి.నారాయణ మాట్లాడుతూ.. ఏ గ్రామంలో చూసినా తాగునీటి సమస్య ఉందని, రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రాంతంలోని ఆర్‌డిఎస్ కుడికాలువ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గురు రాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా మాధవరం, సూగూరు లిఫ్టులకు, బసలదొడ్డి లిఫ్టు ద్వారా సాగు, తాగునీరు అందించాలని కోరారు. మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాలకు పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులు వేసి తాగునీరు అందించాలని, ఎస్ఎస్‌ట్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వాస్తవ సాగుదారులనే నమోదు చేయాలి

- ఎపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుపాను పంట నష్టం వివరాల నమోదులో వాస్తవ సాగుదారులను నమోదు చేయాలని, పంట నష్టం అంచనాకు గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ క్రాప్ నమోదు యాప్‌కు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి వాస్తవ సాగుదారులైన రైతులను నమోదు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. మొంథా తుపాను వల్ల ఆస్తి నష్టం పెద్దగా జరగకపోయినా పంట నష్టం అధికంగా జరిగిందన్నారు. పత్తి, మిర్చి, అరటి, బొప్పాయి వంటి తోటలు, కూరగాయల సాగు చేసే రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అయినప్పటికీ నష్టపోయిన కౌలు రైతుల పేర్లు నమోదు చేయడంలో అన్యాయం జరిగిందన్నారు. పాలకుల దుర్మార్గపు నిర్ణయాల వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందలేదని, గుర్తింపు కార్డులు లేని కౌలు రైతుల పేర్లను ఈ క్రాప్‌లో నమోదు చేయడం లేదన్నారు. పంట సాగు చేయని రైతుల పేర్లతోనే ఈ క్రాప్ నమోదు జరిగిందని తెలిపారు.కౌలు రైతులు పెట్టుకున్న అర్జీలను పరిగణలోకి తీసుకుని పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని నమోదు చేయాలన్నారు.

యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కుర్లపల్లి గ్రామానికి చెందిన కుందుర్పయ్య పేరుమీద ఐదుఎకరాల భూమి ఉంది. ఆయన కుమారుడు వెంకటేశులు (30) ఆ భూమిని సాగు చేస్తున్నారు. కుటుంబ పోషణ, వ్యవసాయ ఖర్చుల కోసం కొంతమేర అప్పులు చేశారు. మూడేళ్లలో 24 బోర్లు వేశారు. ఇందుకోసం మరికొంత అప్పులు చేశారు. వర్షాధారంపై సాగుచేసిన పంటలు కూడా నష్టాన్ని తెచ్చాయి. ప్రయివేటు వ్యక్తుల వద్ద తీసుకున్న రూ.15లక్షలు, తండ్రిపేరు మీద ఎస్‌బిఐలో రూ.రెండు లక్షల పంట రుణం ఉంది. అప్పుల వాళ్ల ఒత్తిడి తాళలేక బుధవారం తన వ్యవసాయ తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులబాధ భరించలేక తన కుమారుడు మరణించినట్లు కుందుర్పయ్య కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాలేపాటి కుటుంబానికి అండగా ఉంటాం

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-దగదర్తి (నెల్లూరు)

మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ భరోసానిచ్చారు. నెల్లూరు జిల్లా దగదర్తిలోని మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబసభ్యులను గురువారం లోకేష్ పరామర్శించారు. అనంతరం మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు మంత్రులు లోకేష్, ఎన్ఎండి ఫరూక్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ వంటి నాయకులను కోల్పోవడం బాధాకారమన్నారు. మండలపార్టీ అధ్యక్షుడుగా, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సుబ్బానాయుడు సేవలు అందించారన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేశారని కొనియాడారు. సుబ్బానాయుడు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని, ఆసుపత్రికి వెళ్లి పరామర్శించానని, దురదృష్టవశాత్తు ఆయన మరణించారని, ఇది బాధాకరమన్నారు. ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మాలేపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లోకేష్

వేతనాల పెంపు కోసం కాఫీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పాడేరు, చింతపల్లి (అల్లూరి జిల్లా)

వేతనాలు, కూలి రేట్లు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాడేరు ఏజెన్సీలోని కాఫీ కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి దిగారు. జిల్లా కేంద్రం పాడేరులోని మినుములూరు ఎపిఎఫ్‌డిసి కాఫీ ఎస్టేట్‌లో పని చేస్తున్న కార్మికులు విధులను బహిష్కరించారు. రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద బైఠాయించి పెద్దపెట్టున నినదించారు. చింతపల్లి మండల కేంద్రంలో కాఫీ డివిజనల్ కార్యాలయానికి పెద్ద ఎత్తున కార్మికులు ప్రదర్శనగా వెళ్లి ధర్నా చేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.చిన్నయ్యపడాల్, కాఫీ కార్మిక సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎల్.సుందరరావు మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం 20 రోజుల క్రితం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసినా స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. సంస్థను రక్షించుకుంటూనే పోరాటం చేస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం యాజమాన్యం, కార్మికుల మధ్య కుదిరిన ఒప్పందంలో హెల్పర్ల జీతాల సమస్య తప్ప ఇంకేవీ పరిష్కారం కాలేదన్నారు. విడిఎ పాయింట్లకు అనుగుణంగా కేజీ పండ్ల రేటు, రోజువారీ కూలీ పెంపు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్‌ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పండుగలకు ఫ్రీ మస్తర్లు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య ఖర్చులను సంస్థనే భరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఎఫ్‌డిసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొర్రా రాజు, మాజీ అధ్యక్షులు ఎన్.కనకవల్లి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలోని కాఫీ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద బైఠాయించి నినాదాలు చేస్తున్న కార్మికులు

రైతులతో మాట్లాడుతున్న నాయకులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - రొద్దం (శ్రీ సత్యసాయి జిల్లా)

సోలార్ విద్యుదుత్పత్తి కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలోని కొగిర గ్రామంలో గురువారం వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సోలార్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దడాల సుబ్బారావు మాట్లాడుతూ సోలార్, ఎరో స్పెస్, సెజ్‌ల పేరుతో జిల్లాలో వేలాది ఎకరాల భూమిని తీసుకుని గత ప్రభుత్వాలు ఒక్క పరిశ్రమైనా పెట్టకుండా రైతులను మోసం చేశాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తోందని వివరించారు. సోలార్ విద్యుదుత్పత్తి ఏర్పాటు పేరుతో భూసేకరణ చేపట్టిందని, ఎకరాకు రూ. 30 వేలు ప్రకారం 30 సంవత్సరాల వరకు లీజు పద్ధతి తీసుకొంటామని నమ్మబలుకుతూ రైతులను మభ్యపెట్టేందుకు సిద్ధమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్ణయాల వల్ల రైతులు తమ భూముల్లోనే కూలీలుగా మారుతారన్నారు. ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తే వారికి వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, అధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

- ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-బాపట్ల (బాపట్ల జిల్లా)

ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు లారీని ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన బాపట్ల గడియార స్తంభం సెంటర్‌లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఆరుగురు యువకులు మూడు ద్విచక్ర వాహనాలపై గురువారం అర్ధరాత్రి బాపట్ల పట్టణానికి వచ్చారు. వారంతా సూర్యలంక బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లోకి పోలీసులు అనుమతించకపోవడంతో బాపట్లకు తిరుగుప్రయాణమయ్యారు.

గుంటూరు కొరటిపాడు ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వాన్ (18) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మరో యువకుడు చింతల నాని (21) గుంటూరు నగరంలోని వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వీరు అతివేగంతో చీరాల వైపు నుంచి బాపట్ల పాత బస్టాండ్ వైపునకు వెళు తూ.. లారీని బలంగా ఢీకొట్టారు. తీవ్రగాయాలతో ఘటనాస్థలంలోనే ఇద్దరూ మరణించారు. మృతదేహాలను బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదరగొట్టిన ఎల్‌ఐసి..

- క్యూ2 లాభాల్లో 32 శాతం వృద్ధి
- ఆస్తులు రూ.57.23 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ ప్రభుత్వ రంగ దిగ్గజం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 10 శాతం వృద్ధితో రూ.10,053 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.7,620.86 కోట్ల లాభాలతో పోల్చితే ఏకంగా 32 శాతం వృద్ధి చోటు చేసుకోవడం విశేషం. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో ఎల్‌ఐసి నికర ప్రీమియం ఆదాయం 5.5 శాతం పెరిగి రూ.1.26 లక్షల కోట్లకు చేరింది. ఎల్‌ఐసి మొత్తం ఆస్తుల విలువ (ఎయుఎం) 3.31 శాతం పెరిగి రూ.57.23 లక్షల కోట్లకు చేరింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ తొలి ఏడాది ప్రీమియం ఏకంగా రూ.10,884 కోట్లకు పెరిగింది. ఇది గతేడాది ఇదే సమయంలో రూ.7,566 కోట్లుగా ఉంది. ఇదే సమయంలో రూ.60,179 కోట్లుగా ఉన్న రెన్యూవల్ ప్రీమియం.. గడిచిన క్యూ2లో రూ.65,320 కోట్లుగా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో 16 శాతం వృద్ధితో రూ.21,040 కోట్లుగా నమోదయ్యింది. మొత్తం ప్రీమియం ఆదాయం 5 శాతం పెరిగి రూ.2,45,680 కోట్లకు చేరింది. సంస్థ మొత్తం వ్యయాలు 12.74 శాతం నుంచి 11.28 శాతానికి తగ్గాయి.

ఆదివాసీల జీవితాలను నాశనం చేస్తారా?

- పంప్డ్ హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి - మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టును రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. దుగ్గేర్లో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో బాధిత గిరిజన గ్రామాల ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ దుగ్గేరులో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి చింతాగ్రీన్ ఎనర్జీ కంపెనీకి టిడిపి కూటమి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని వెంగళరాయ సాగర్, తోటపల్లి ప్రాజెక్టుల నుంచి 24 ఎంఎంసిలను పైపుల ద్వారా తరలించడానికి కూడా కంపెనీకి అనుమతులిచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల దుగ్గేరులోని ఆదివాసీ గిరిజనుల బతుకులు నాశనమవ్వడమే కాకుండా, ఆదివాసీ గ్రామాలు కనుమరుగవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల పోడు, సంప్రదాయ వ్యవసాయం, జీడి తోటలు దెబ్బతిని పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, ఈ ప్రాజెక్ట్ వల్ల కరెంటు తయారైతే ఆ ప్రాంతం చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు కిందన ఎనిమిది వేల ఎకరాలకు, తోటపల్లి ప్రాజెక్టు కింద 60 వేల ఎకరాలకు సాగునీరందడం లేదన్నారు. అటు రైతులు, ఇటు గిరిజనులను ఇబ్బందులకు గురిచేసే పవర్ గ్రిడ్ ప్రాజెక్టు అనుమతులు రద్దుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయకపోతే ఆదివాసీ ప్రాంతంలోని గిరిజనులందర్నీ కదిలిస్తామని, బాధిత రైతులనూ కలుపుకొని పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, మండల నాయకులు కొండగొర్రె ఆనంద్, వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

పసిడి బాండ్లపై మూడు రెట్ల రాబడి

న్యూఢిల్లీ : బంగారం బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి మూడు రెట్ల రిటర్న్‌లు వస్తోన్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సావరిన్ గోల్డ్ బాండ్స్ పథకం (ఎస్‌జిబి)లో 2017-18లో సిరీస్6లో పెట్టుబడులు పెట్టిన వారికి ఇప్పుడు 316 శాతం లాభాలు వస్తున్నాయి. బంగారం దిగుమతులను తగ్గించుకోవడానికి పసిడిపై డిజిటల్ పెట్టుబడులకు వీలుగా 2015లో ఎస్‌జిబిని కేంద్రం ప్రవేశపెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గ్రాముకు రూ.12,066 తుది రిడంప్షన్ ధరను నిర్ణయించింది. 2017 నవంబర్‌లో గ్రాముకు రూ.2,945 వద్ద జారీ చేసిన బాండ్లు ఇప్పుడు రూ.9,171 రిటర్న్‌లు ఇచ్చాయి. దీనికి ఆర్నెళ్లకోసారి చెల్లించే 2.5 శాతం వార్షిక వడ్డీ అదనం కావడం విశేషం. సిరీస్4లో పెట్టుబడులు పెట్టిన వారికి గత అక్టోబర్‌లో 325 శాతం రిటర్న్ అందాయి.

14న ఇడి విచారణకు మళ్లీ అనిల్ అంబానీ

న్యూఢిల్లీ: బ్యాంక్‌ల మోసం, మనీలాండరింగ్‌కు పాల్పడిన రిలయన్స్ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీపై విచారణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరింత వేగవంతం చేసింది. నవంబర్ 14న విచారణకు తమ ఆఫీసుకు రావాలని అంబానీకి ఇడి నోటీసులు జారీ చేసింది. బ్యాంకు మోసం కేసు, మనీలాండరింగ్ ఆరోపణలపై విచారించనున్నట్లు తెలిపింది. ఈ దఫా ఎస్‌బిఐకి రుణం ఎగవేత, ఆ నిధుల మళ్లింపునకు సంబంధించిన మనీలాండరింగ్‌పై ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ దాదాపు రూ.17వేల కోట్ల రుణ మోసాలకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ గ్రూపునకు చెందిన రూ.7,500 కోట్ల ఆస్తులను ఇడి అటాచ్ చేసింది.

బజాజ్ ఎంఎఫ్ నుంచి కొత్త ఎన్ఎఫ్ఒ

న్యూఢిల్లీ : బజాజ్ ఫైన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ (బిఎఫ్ఎఎంఎల్) కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఫండ్‌ను విడుదల చేసింది. ఈ ఒపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్సియల్ రంగంలోని అవకాశాలను అందిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఒ) నవంబర్ 10న ప్రారంభమై.. 24తో ముగుస్తుంది. కనీస పెట్టుబడిని రూ.500గా నిర్ణయించింది. కేటాయింపుల తర్వాత మూడు నెలల్లోపు ఉపసంహరించుకుంటే 1 శాతం ఛార్జీని విధించనుంది.

సంపాదకీయం

ఏదీ ప్రయాణ భద్రత?

ఇటీవల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మన రవాణా వ్యవస్థలోని లోపాలను బట్టబయలు చేస్తున్నాయి. రహదారి భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఉద్యోగం, ఉపాధి, పరామర్శ, సందర్శన తదితర అవసరాలకు ప్రయాణాలు చేయడం ఏ ఒక్కరికైనా తప్పనిసరి. ఇలా ప్రయాణమై సాగే వాళ్లు భద్రంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి. అందుకు తగ్గట్టుగా రహదారులు, వాహనాలు, రవాణా వ్యవస్థ సన్నద్ధమై ఉండాలి. కానీ, ఏం జరుగుతోంది మనదేశంలో? ప్రపంచంలోని వాహనాల్లో మనదేశంలో ఉన్నవి ఒక్క శాతం కాగా, రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య మాత్రం 11 శాతం! మన రోడ్డు భద్రతా వ్యవస్థలోని లోపాలను, ప్రమాణాల్లోని డొల్లతనాన్ని ఈ లెక్క వెల్లడి చేస్తోంది.

దేశంలో ఏటా దాదాపు 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగి, 2 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడ్డవారి సంఖ్య దీనికి రెట్టింపు ఉంటుంది. ఈ ప్రమాదాల్లో 70 శాతం అతివేగం వల్లే సంభవిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. రాంగ్‌రూట్లో నడపటం, మద్యం సేవించి నడపటం వంటి కారణాలు తరువాతి వరుసలో ఉన్నాయి. ప్రమాదాల్లో అత్యధిక భాగం జాతీయ రహదారుల మీదనే జరుగుతున్నాయి. ఎక్కడ, ఎందుకు, ఏ సమయంలో, ఏ పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయో సంబంధిత శాఖల వద్ద స్పష్టమైన గణాంకాలూ, సోదాహరణమైన వివరాలూ ఉన్నప్పటికీ- వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకం! ప్రయాణాలకు వీలుగా రహదారులను భద్రంగా ఉంచటం, వేగ నియంత్రణ, వాహనాల స్థితిపై తనిఖీ, ప్రమాణాల పాటింపు వంటి చర్యలను పటిష్టవంతంగా అమలు చేస్తే - ఇన్ని ప్రమాదాలు జరిగి ఉండేవి కావు. ఈ మధ్య జరిగిన ప్రమాదాల్లోనే పాలకుల తరపున అనేక డొల్లతనాలు, నిర్లక్ష్యాలూ బయటపడ్డాయి. ప్రయివేటు బస్సులు నడపటంలో ప్రమాణాలకు నీళ్లొదలటం స్పష్టంగా కనిపిస్తోంది. వేగంపై నియంత్రణ లేకపోవటం, సిట్టింగ్ ప్రయాణ అనుమతులున్న బస్సులను స్లీపరు కోచ్‌లుగా మార్చటం, భద్రతా పద్ధతులను పట్టించుకోకపోవటం, డ్రైవర్లకు సరైన శిక్షణ, నిర్వహణపై అవగాహన లేకపోవటం ... పెను ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రజారవాణాను ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టటంతోనే ప్రయాణ భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలను నివారించాలంటే ఈ అంశాలపై తప్పకుండా చర్చించాలి. సరైన ప్రమాణాలను, పద్ధతులను ఆచరించాలి.

పాలకులు జాతీయ రహదారులను ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవటంపై చూపుతున్నంత శ్రద్ధ- వాటిని భద్రతా మార్గాలుగా మలచటంపై కనపరచటం లేదు. హైవేలు అంతటా నెలకొల్పిన టోల్‌ప్లాజాలు ఏటా వేలాది కోట్ల రూపాయలను వాహనదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిపై రూపాయి పెట్టుబడి పెట్టి, రూ.3.31ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అంటే పెట్టుబడికి మూడింతలు పైగానే రాబడిని పొందుతోంది. కానీ, రహదారి భద్రతపై చూపుతున్న శ్రద్ధ, పెడుతున్న ఖర్చు అంతంతమాత్రంగానే ఉంది. ఆదాయంలో అత్యధిక భాగాన్ని రిలయన్స్ వంటి కార్పొరేట్ల ఖజానాలోకి ప్రవహించే విధంగానే హైవేల నిర్వహణ సాగుతోంది.

భద్రమైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం ఒక దేశ అభివృద్ధికి అచ్చమైన కొలమానం. ప్రపంచంలో జరిగే ప్రమాదాల్లో నూటికి 18 మన దగ్గరే జరుగుతున్నందున - మనదేశ రవాణా వ్యవస్థ ఇంకా అస్తవ్యస్త దేశాల సరసనే ఉంది. లాభాలే పరమార్థంగా సాగే ప్రైవేటు రవాణా వ్యవస్థ భద్రతకు ఇచ్చే ప్రాధాన్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. రైల్వేల్లో అయినా, రోడ్డు రవాణాలో అయినా-నైపుణ్యమూ, నాణ్యతా ఉన్న సిబ్బంది సేవలు అవసరమవుతాయి. కీలకమైన విభాగాల్లో శాశ్వత ఉద్యోగులను నియమించకుండా ప్రయివేటు, కాంట్రాక్టు సేవలకు వదిలేయటం అంటే భద్రతకు భరోసా లేనట్టే లెక్క! కాలం చెల్లిన వాహనాలను రోడ్డెక్కకుండా చేయడం, ఉన్న వాహనాల కండిషన్‌పై నిరంతర తనిఖీలు జరపటం తక్షణ అవసరం. రాజకీయ జోక్యాలతోనూ, ఇతరత్రా కారణాలతోనూ ప్రైవేటు ట్రావెల్స్ పట్ల ఉదాసీనత ప్రదర్శించటాన్ని మానుకోవాలి. భద్రమైన ప్రయాణం ప్రతి ఒక్కరి హక్కు. దానిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిది!

మహనీయుల మాట

విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగశాలల పరికరాలతో వికసించదు.
నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తులే విజ్ఞానశాస్త్ర సాగరాన్ని మథిస్తాయి.

- సర్ సి.వి. రామన్,
భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత.

జననం: 7.11.1888

మరణం: 21.11.1970

విశ్లేషణ

అదానీ లబ్ధి కోసం ఎల్.ఐ.సి పై ఒత్తిడి

తిరుమారన్

దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చడంలో మోడీ ప్రభుత్వానిది పెట్టింది పేరు. ఇంక అది అదానీ సంస్థ అయితే ఆంతరంగిక బృంద సమానురాలనేది జగమెరిగిన సత్యం. దేశంలోని జీవిత బీమా సంస్థల్లో మొనగాడు సంస్థ అయిన లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్.ఐ.సి) ద్వారా అదానీ సంస్థను అప్పుల నుండి బయటపడేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టేలా చేసిందని 'వాషింగ్టన్ పోస్ట్' వెలువరించిన కథనం పై రెండు అంశాలనూ నిర్ధారిస్తుంది.

ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈ ఏడాది మే నెలలో అదానీ గ్రూపు జారీ చేసిన బాండ్లలో 3.9 బిలియన్ డాలర్ల (రూ.33,000 కోట్లు) పెట్టుబడులు పెట్టేలా ఒత్తిడి చేసిందని మంత్రిత్వ శాఖ అంతర్గత డాక్యుమెంట్ల ద్వారా తెలియవస్తున్నదని ఆ ప్రతిక వివరించింది. న్యూయార్క్ కేంద్రంగా కార్పొరేట్ మోసాలను, అక్రమ లావాదేవీలను బహిర్గతం చేసే హిండెన్ బర్గ్ సంస్థ 2023 లోనే అదానీ సంస్థ మార్కెట్ నియంత్రణలను ఉల్లంఘించి సంస్థ షేర్ విలువను కృత్రిమంగా పెంచుకున్నదని ఆరోపించింది. ప్రస్తుతం అదానీ సంస్థ అమెరికా న్యాయ విభాగ సంస్థ నుండి క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నది. పన్ను స్వర్గ ధామాలుగా పేరొందిన దేశాల నుండి ఊరూ పేరూ తెలియని సంస్థలు వేలాది కోట్ల రూపాయలు అదానీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి 'సెబి' రూపొందించిన మార్కెట్ నియంత్రణలను ఉల్లంఘించాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

అయితే కేంద్ర, ఆర్థిక మంత్రిత్వ శాఖ మద్దతుతో 'సెబి' ఈ ఆరోపణలను నిష్పాక్షికంగా నిగ్గు తేల్చడంలో విఫలమైంది. 2024లో అదే అదానీ సంస్థపై అమెరికా తాజాగా నేరారోపణలు చేసింది. అదానీ గ్రూపు సంస్థల రారాజు గౌతమ్ అదానీ, అతని సహచరులు లంచాలు చెల్లించడం ద్వారా మోసపూరిత, అక్రమ ఆర్థిక లావాదేవీలకు పాల్పడ్డారనేది ఈ ఆరోపణల సారాంశం. ఈ నేపథ్యంలో అదానీ బాండ్లలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసి ని కేంద్ర, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇదే నెలలో అదానీ పోర్టు సంస్థ జారీ చేసిన 585 మిలియన్ డాలర్ల (రూ.4,950 కోట్లు) బాండ్ల మొత్తాన్ని ఎల్.ఐ.సి నే కొనుగోలు చేసింది. ఈ బాండ్ల ద్వారా సమకూరిన మొత్తాన్ని అదానీ పోర్టు తన బకాయిలు చెల్లించడానికి వినియోగించింది.

కేంద్ర మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, ఎల్ఐసి అధికారిక బృందం అదానీ సంస్థలో పెట్టుబడుల గురించి ఉమ్మడిగా చర్చించాయని 'వాషింగ్టన్ పోస్ట్' బయటపెటింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అయితే అదానీని 'దార్శనిక పారిశ్రామికవేత్త' అని నిస్సిగ్గుగా కొనియాడింది. ఎల్.ఐ.సి పెట్టుబడులు పెట్టడం ద్వారా అదానీ గ్రూపు పట్ల విశ్వాసం నెలకొల్పే వ్యూహాత్మక లక్ష్యాన్ని సాధించడంతో పాటు ఇతర పెట్టుబడిదారులను కూడా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించినట్లు అవుతుందని సదరు మంత్రిత్వశాఖ ఆ విధమైన ప్రతిపాదన చేసింది.

ప్రభుత్వం తరపున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసే గవర్నమెంట్ సెక్యూరిటీస్ కన్నా అదానీ గ్రూప్ జారీ చేసే బాండ్లు ఆకర్షణీయమైన రాబడిని ఇస్తాయని కూడా ఆర్థిక మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది. కానీ ఎల్.ఐ.సి పెట్టుబడుల ప్రక్రియను దీర్ఘకాలంగా పరిశీలిస్తున్న విశ్లేషకులు మాత్రం "ఇది పూర్తిగా దారి తప్పడమే. ఎల్.ఐ.సి మొదటి నుండీ చాలా కట్టుబాట్లతో కూడిన పెట్టుబడులు పెట్టే పద్ధతిని పాటిస్తూ వచ్చింది. రాబడి కన్నా పెట్టుబడులు



సురక్షితమా కాదా అనే అంశానికే ఎల్.ఐ.సి ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది" అని వివరిస్తున్నారు. ఎల్.ఐ.సి అధికారికంగా గవర్నమెంటు సెక్యూరిటీస్ లోనే పెట్టుబడులు పెడుతూ వచ్చింది. ఎందుకంటే ఈ సంస్థలో పొదుపు చేస్తున్నది కోట్లాది మంది సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం కాబట్టి అధిక రాబడి కోసం రిస్కులు తీసుకోవడం కన్నా ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడమే ముఖ్య లక్ష్యంగా పెట్టుకున్నది.

అలాంటిది ఒకపక్క అదానీ గ్రూపు సంస్థల రుణభారం దృష్ట్యా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో ఎల్.ఐ.సి ఆ కంపెనీ జారీ చేసిన బాండ్లలో ఇంత భారీ మొత్తాన్ని పెట్టుబడులు పెట్టడాన్ని జనం ఆక్షేపిస్తున్నారు. ఈ వ్యవహారం మార్కెట్‌లోనో, బాండ్ల లోనో ఎల్.ఐ.సి కేవలం పెట్టుబడులు పెట్టడంగా పరిగణించలేం. ఎల్.ఐ.సి పెట్టుబడులను చూపించి ఇతర సంస్థల పెట్టుబడులకు వల వేసే పన్నాగం ఇది.

సరిగ్గా జరిగింది కూడా ఇదే. అదానీ బాండ్లలో ఎల్.ఐ.సి పెట్టుబడులు పెట్టిన తర్వాత ఒక నెల రోజులకు అదానీ పోర్టు తరపున జారీ చేసిన 750 మిలియన్ల డాలర్ల బాండ్లలో అమెరికాకు చెందిన 'ఏథెనె' ఇన్సూరెన్స్ కంపెనీ పెట్టుబడులు పెట్టింది. ఎల్.ఐ.సి 2025 మే నెలలో అదానీ బాండ్లు కొన్న తదనంతరం ఆ సంస్థ మరో 10 బిలియన్ డాలర్ల బాండ్లు జారీ చేసింది. ఇందులో దాదాపు 1.625 బిలియన్ డాలర్ల (రూ.13,750 కోట్లు) బాండ్లను మన దేశంలోని మ్యూచువల్ ఫండ్‌లు, బ్యాంకులు, ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలూ కొనుగోలు చేశాయి.

దేశంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్‌బ్యాంక్ కానీ, ప్రైవేటు రంగంలోని ఐ.సి.ఐ.సి.ఐ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకులు కానీ ఎల్.ఐ.సి. స్థాయిలో ఇంత భారీ పెట్టుబడులు పెట్టడానికి సాహసించలేదు. 2025 మార్చి నాటికి ఎల్.ఐ.సి దగ్గర 47.85 లక్షల కోట్ల రూపాయల జీవిత బీమా నిధి ఉన్నది. పాలసీదారుల క్లెయిమ్‌లను చెల్లించడానికి ఉద్దేశించిన నిధి ఇది. దేశంలోని ఏ ఇతర ఇన్సూరెన్స్ కంపెనీ దగ్గరా ఇంత భారీ మొత్తంలో 'కార్పస్' నిధి లేదు. ప్రపంచ వ్యాప్తంగా చూసినా ఈ నిధిలో ఎల్.ఐ.సి దే అగ్రస్థానం. గత కొన్నేళ్లుగా ఈ నిధి వాటా 10 శాతం చొప్పున పెరుగుతూ వస్తున్నది. అంటే ఎల్.ఐ.సి పెట్టుబడులు అంత పకడ్బందీగా ఉంటాయి. అలాంటి ఎల్.ఐ.సి మెడలు వంచి అదానీ బాండ్లను కొనిపించడంతో మార్కెట్‌లో ఆ కంపెనీ బాండ్ల పట్ల అంతగా ఆసక్తి చూపని పెట్టుబడుల సంస్థలన్నీ క్యూ కట్టాయి.

> **కేంద్ర మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, ఎల్ఐసి అధికారిక బృందం... అదానీ సంస్థలో పెట్టుబడుల గురించి ఉమ్మడిగా చర్చించాయని 'వాషింగ్టన్ పోస్ట్' బయటపెటింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ అయితే అదానీని 'దార్శనిక పారిశ్రామికవేత్త' అని నిస్సిగ్గుగా కొనియాడింది. ఎల్.ఐ.సి పెట్టుబడులు పెట్టడం ద్వారా అదానీ గ్రూపు పట్ల విశ్వాసం నెలకొల్పే వ్యూహాత్మక లక్ష్యాన్ని సాధించడంతోపాటు ఇతర పెట్టుబడిదారులను కూడా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించినట్లు అవుతుందని సదరు మంత్రిత్వశాఖ ఆ విధమైన ప్రతిపాదన చేసింది.**

అయితే ఎల్.ఐ.సి మాత్రం 'వాషింగ్టన్ పోస్ట్' కథనాన్ని తోసిపుచ్చింది. ఆ పత్రిక ఆధారాలు లేని కథనాన్ని ప్రచురించిందనీ, బోర్డు నిర్ణయం ప్రకారమే ఈ పెట్టుబడులు పెట్టామని ఒక ప్రకటన జారీ చేసింది.

ప్రధాన స్రవంతి మీడియా అదానీ, మోడీ ప్రభుత్వాలకు కొమ్ము కాసింది. ఎల్.ఐ.సి నిర్ణయాన్ని సమర్థించే క్రమంలో అసలు స్వయంప్రతిపత్తిగల ఇంత పెద్ద ఆర్థిక సంస్థ వ్యవహారాలలో ప్రభుత్వం ప్రత్యక్షంగా ఎందుకు జోక్యం చేసుకోవలసి వచ్చిందనే కీలకమైన, అడగవలసిన ప్రశ్నను దాట వేసింది. అదానీ సంస్థ పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, సిమెంటు ఒకటేమిటి దేశంలో అన్ని రంగాలలో పేరొందిన బడా కార్పొరేట్ సంస్థ కదా. అలాంటి బడా సంస్థలో ఎల్.ఐ.సి పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఇది సరైన వ్యాపార నిర్ణయం ఎలా అవుతుంది? అనే అంశాలను వివరించిన వారే లేరు.

'ఎల్.ఐ.సి అదానీ గ్రూప్‌లో పెట్టిన పెట్టుబడులు దాని మొత్తం పెట్టుబడులలో ఎంత ఉంటాయి? టాటా, రిలయన్స్, ఐ.టి.సి లలో ఎల్.ఐ.సి. పెట్టుబడులు పెట్టలేదా?' అని కొందరు అడ్డ సవాళ్లు లేవనెత్తుతున్నారు. ఈ సంస్థలలో ఎల్.ఐ.సి. పెట్టుబడులు చాలా ఏళ్ళ క్రితం నుండి క్రమానుగతంగా పెరుగుతూ వచ్చాయి. ఈ సంస్థలకు, అదానీ సంస్థలకు పోలికే లేదు. 2014లో మోడీ ప్రధాని బాధ్యతలు చేపట్టాక అదానీ గ్రూపు అనూహ్యంగా పెరిగి, పెరిగి ఈ స్థాయికి చేరింది. ప్రతి మలుపులోనూ ఈ సంస్థ విస్తరిస్తున్న తీరుపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పెరుగుదల 'వాపు' అని మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం.

ఎల్.ఐ.సి కి దీర్ఘకాలిక చెల్లింపుల బాధ్యత ఉంటుంది. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులే లక్ష్యంగా పనిచేస్తుంది. మీడియా ప్రచారం చేస్తున్నట్లు ఎల్.ఐ.సి కి బంపర్ రాబడి వస్తుందనేది నమ్మశక్యంకాని విషయం. ఎల్.ఐ.సి కోట్లాదిమంది పాలసీదార్ల సొమ్ముకి పూర్తి బాధ్యత వహించాల్సిన సంస్థ. ఆ బాధ్యత నిలబెట్టుకోవడమే దాని పరమోన్నత లక్ష్యం తప్ప బంపర్ రాబడి కోసం కోట్లాది మంది జనం సొమ్ముని రిస్కున పడేయడం కాదు.

అదానీ గ్రూపు మీద వచ్చిన ప్రతి ఆరోపణనూ మోడీ ప్రభుత్వం తేలిగ్గా తీసిపారేస్తూ వచ్చింది. తప్పుడు ఇన్వాయిస్‌లతో సహా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపులో ప్రభుత్వ జోక్యం ద్వారా ఎల్.ఐ.సి పెట్టుబడులు పెట్టడం మీద సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు చెయ్యాల్సిన అవసరం ఉన్నది.

అంతర్జాతీయం

న్యూయార్క్ పీఠంపై సోషలిస్టు మమ్దానీ

ప్రపంచ పెట్టుబడికి కేంద్ర స్థానమైన అమెరికాలో ఓ సోషలిస్టు నగర మేయర్‌గా ఎన్నికవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో డెమోక్రాట్ల తరపున పోటీ చేసిన సోషలిస్టు జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించి సంచలనం సృష్టించారు. ప్రతీ నాలుగేళ్లకు ఎన్నికలు సాధారణంగా జరిగేవే! అయితే ఈ ఎన్నికలు ప్రత్యేకమైనవి, అంతకంటే మమ్దానీ గెలుపు మరింత ప్రత్యేకం. అన్ని ఇజాలు పోయాయి అంటూ నిరంతరం కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రచారం చేసే పెట్టుబడిదారీ మీడియా ఎంత దుష్ప్రచారం చేసినా న్యూయార్క్ వాసులు మమ్దానీ వైపు నిలిచారు. నల్లజాతీయులు, ఆసియా ఓటర్లు ఆయన గెలుపులో కీలకంగా మారారు. అతి పిన్న వయస్కుడైన 34 ఏళ్ల మమ్దానీ న్యూయార్క్ నగరం యొక్క ఆర్థిక సంక్షోభం, సామాజిక న్యాయం, ప్రజా భద్రతా సంస్కరణలు, పిల్లల సంరక్షణ, ఉచిత బస్సు ప్రయాణాలు, ఆహార ధరల నియంత్రణ, నగర యాజమాన్యంలో కిరాణా దుకాణాలు, అద్దె స్థిరీకరణతో పాటు 2 లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తానని ప్రచారం చేశారు. అంతేకాదు సంపన్నులపై 2 శాతం పన్నులు వంటి ప్రగతిశీల విధానాల ప్రచారంతో, ఉద్యోగాలు, అద్దెలు, ఆర్థిక సమస్యల పరిష్కారం, ఎల్‌జిబిటిక్యూ హక్కులు, కనీస వేతనం వంటి విషయాలతో యువ ఓటర్లను సైతం ఆకట్టుకున్నారు. శ్రామికులు, అట్టడుగు వర్గాల జీవన నాణ్యతను మెరుగుపరుస్తానని మమ్దానీ ప్రకటించారు. నగర మేయర్‌గా ఎన్నికైన మొదటి ఇండో-అమెరికన్‌గా, మొదటి ముస్లింగా, మొదటి సోషలిస్టుగా మమ్దానీ చరిత్ర సృష్టించారు.

విజయం సాధించిన అనంతరం మమ్దానీ మాట్లాడుతూ నేను పెద్దవాడిని కావడానికి ఎంత ప్రయత్నించినా మీ ముందు చిన్నవాడినే. నేను ముస్లింను, అంతకు మించి డెమోక్రటిక్ సోషలిస్టుని అని ప్రకటించారు. న్యూయార్క్ నగరం వలసదారుల నగరం. వారితోనే నిర్మించబడిన నగరం. వలసదారులుచే శక్తి పొందుతున్న నగరం. ఈ రోజు నుండి ఒక వలసదారుడే పరిపాలించే నగరం అంటూ ఉత్తేజకరంగా ప్రసంగించారు. మమ్దానీ తన విధానాలను స్పష్టంగా ప్రజల్లో ప్రచారం చేసి ఓట్లు పొందారు. ముఖ్యంగా వలస వచ్చిన వారికి రక్షణ కల్పిస్తానని, అందరం కలిసి న్యూయార్క్‌ను అభివృద్ధి చేద్దామంటూ ప్రసంగించారు. మరో ముఖ్యమైన విషయం డెమోక్రాట్ అగ్ర నాయకులు బరాక్ ఒబామా, కమలా హారిస్ వంటి వారు కూడా మమ్దానీకి సపోర్టుగా నిలబడలేదు. క్యాంపెయిన్ చేయలేదు. అయినా న్యూయార్క్ ప్రజలు 50.4 శాతం ఓట్లు వేసి మమ్దానీ వైపు నిలబడ్డారు.



బెదిరింపులు తోసిపుచ్చి ...

34 సంవత్సరాల మమ్దానీని దేశాధ్యక్ష స్థానంలో ఉన్న ట్రంప్ టార్గెట్ చేయడం విశేషం. ట్రంప్ విమర్శలతో అతను దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడు. న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ అనుభవం లేని వ్యక్తి, కమ్యూనిస్టు. అతను గెలిస్తే నగరం ఇబ్బందుల్లో పడుతుందని ట్రంప్ పదేపదే హెచ్చరించారు. భవిష్యత్తులో అభివృద్ధికి నిధులు రాకుండా చేస్తానని, అతనికి ఓటు వేయడంలో అర్థంలేదని ఎన్నికలకు ముందు తన అక్కసును వెళ్లగక్కారు. అంతేకాదు. సొంత రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కర్టిస్ స్లీవాకు ఓటు వేయవద్దని స్వతంత్ర అభ్యర్థి ఆండ్రూ కుమోకు ఓటు వేయాలని ట్రంప్ ప్రచారం చేశారు. అయితే ఎన్ని కుట్రలు చేసినా ట్రంప్, ఆయన సహచర శత కోటీశ్వరులు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేరని మమ్దానీ కూడా సీరియస్‌గానే స్పందించారు. న్యూయార్క్ నగరంలో సమస్యలను పరిష్కరించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి మామ్దానీ ప్రచారం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ పదే పదే మమ్దానీని విమర్శించడానికి డెమోక్రాట్లు అతన్ని భవిష్యత్తు నాయకుడిగా చూడటం ఒక కారణం. అమెరికా సమాజం ఎప్పటికి సోషలిస్టు విధానాలను అంగీకరించదని, ఎప్పటికీ కమ్యూనిస్టు దేశంగా మారదని అనేక సార్లు చెప్పారు. కాని అమెరికా సమాజంలో సోషలిజం, కమ్యూనిజం పట్ల ఆసక్తి పెరుగుతున్నదని కాటో-యుగోవ్ సంస్థ తెలిపింది. 30 ఏళ్ల లోపు అమెరికన్ యువత 62 శాతం మంది సోషలిజంపై, 34 శాతం మంది కమ్యూనిజం పట్ల అసక్తి చూపిస్తున్నారని ఆ సంస్థ స్పష్టంగా చెప్పింది.

సంపన్నులకు, సామాన్యులకు యుద్ధం

2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైన తర్వాత డెమోక్రాట్లలో మమ్దానీ విజయం నూతన ఉత్సాహాన్ని నింపింది. చాలా మంది ముఖ్య డెమోక్రాట్ నాయకులు గాజాపై ఇజ్రాయిల్ దాడుల గురించి మాట్లాడటానికి వెనుకాడారు. కాని మమ్దానీ ఇజ్రాయిల్ దాడిని ఖండించారు. అంతే కాదు, గాజాలో మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు న్యూయార్క్ వస్తే అరెస్ట్ చేయిస్తానని సంచలన ప్రకటన చేశారు. ప్రైమరీలో ఓటమి తర్వాత ట్రంప్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా ఆండ్రూ కుమో బరిలోకి దాగారు. ఒకప్పుడు రాజకీయాల్లో ప్రముఖంగా నిలిచిన కుమో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి)లో యుద్ధ నేర ఆరోపణలను ఎదుర్కొంటున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును సమర్థించారు. మమ్దానీ ఆర్థిక ఎజెండాలో సంవత్సరానికి 1 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపాదించే ధనవంతులపై రెండు శాతం నగర ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను రేట్లను పెంచడం ముఖ్యమైనది. దీన్ని కుమో వ్యతిరేకించారు. వలసదారులకు రక్షణ కల్పిస్తానని మమ్దానీ ప్రచారం చేయగా కుమో మాత్రం ట్రంప్ ప్రకటించిన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (ఎంఎజిఎ)ను విస్తృతంగా ప్రచారం చేశారు. అంతే కాదు మమ్దానీని ఓడించడానికి పెట్టుబడిదారులంతా ఒక్కటై దాదాపు 22 మిలియన్ల డాలర్లును ఖర్చు చేశారు. ట్రంప్, ఎలాన్ మస్క్‌లు కుమో గెలుపు కోసం రంగంలోకి దిగారు. ట్రంప్ మద్దతుదారుడు, క్యాపిటలిస్ట్ బిల్ అక్మాన్ కుమోకు పని చేసే "ఫిక్స్ ది సిటీ"కి 5 లక్షల డాలర్లు విరాళంగా ఇచ్చాడు. నగర సంపన్న వర్గమంతా ఏకమైంది. దీంతో మేయర్ ఎన్నికలు సంపన్నులకు, సామాన్యులకు మధ్య యుద్ధంగా మారిపోయాయి. అమెరికాకు వలస వచ్చిన ఆసియా వాసుల పట్ల వివక్ష చూపుతూ వీరు తినడానికి, ఇతర పనులకు చేతిని ఉపయోగిస్తారని సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. భోజనం చేస్తున్న మమ్దానీ ఫొటో పోస్ట్ చేసి హేళన చేశారు. ఇంత చేసినా న్యూయార్క్ ప్రజలు మమ్దానీని ఎన్ను కున్నారు. ట్రంప్ వలస విధానాలు, టారిఫ్‌ల యుద్ధం, వీసా ఆంక్షలతో పాటు ఆర్థిక వ్యవస్థ షట్ డౌన్‌తో అమెరికన్లు విసిగిపోయారు. ఇటీవల ట్రంప్‌ను వ్యతిరేకిస్తూ "నో కింగ్స్" పేరుతో దేశ వ్యాప్తంగా 70 లక్షల మంది రోడ్లపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ట్రంప్ రాజు కాదు, మేము నిరంకుశత్వాన్ని అంగీకరించబోం అంటూ నినదించారు. ఈ ఉద్యమాల వెనక కమ్యూనిస్టులున్నారని స్పీకర్ మైక్ జాక్సన్ విమర్శించారు. అమెరికాలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోతున్నాయని పలు నివేదికలు తెలుపుతున్నాయి. అతి పెద్ద నగరమైన న్యూయార్క్‌లో మమ్దానీ గెలుపు అమెరికాలో సరికొత్త రాజకీయ పరిణామాలకు సూచిక.

- వై. రాము

అవీ ఇవీ

...పొరబాటు కాదా? నిధులు పోలేదా?

సరళీకరణ అనే గరళీకరణ యుగంలో అన్నీ తారుమారుగా మారిపోతున్నాయి. ఈ క్రమంలో సమస్యల రూపం కూడా మారడం గమనించవచ్చు. వామపక్షేతర పార్టీలేవైనా ఆర్థిక విధానాల విషయంలో మాత్రం ఒకే రూటు. అవినీతి ఆరోపణల విషయంలోనూ షరామామూలే. దేశంలో మహా మహా కుబేరులు విదేశాలలో దాచుకున్న అక్రమ సంపద వేల కోట్లు వుందని వింటూనే వున్నాం. ప్రధాని మోడీ గారైతే పదవిలోకి రాకపూర్వం ఆ డబ్బు తీసుకొచ్చి తలకు పదిహేను లక్షలిస్తానని ప్రామిసరీ నోటు రాసినంత పని చేసి ఎగనామం పెట్టారు. ఆ పని చేయకపోగా ఈ మూడో దఫా పాలనలో అందుకు రివర్సు చర్యకు పాల్పడ్డారు. ఏమంటే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విదేశీ కంపెనీల వాటా 20 శాతం నుంచి 49 శాతానికి పెంచేయాలని రిజర్వు బ్యాంకు ప్రతిపాదించింది. లాంఛనంగా దీనికి

కేంద్రం ఆమోదం తెలపాలిగాని అదెలాగూ జరుగుతుంది. ఎందుకంటే ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈ విషయంలో ఆందోళన అవసరం లేదని సమర్థిస్తున్నారు. నిజానికి ప్రభుత్వ రంగ బ్యాంకులను వరుసగా ప్రైవేటుపరం చేయడమే ఒక తప్పు. అలా ఎప్పటికప్పుడు ప్రజల పొదుపు మొత్తాలతో నడిచే బ్యాంకులను ప్రైవేటుపరం చేయగా చేయగా ఇంకా పన్నెండు వరకూ మిగిలాయి. వీటిలో డిపాజిట్ల మొత్తం దాదాపు వంద లక్షల కోట్ల రూపాయలు. ఇది ఏటా పన్నెండు శాతం పెరుగుతుంటుంది. ప్రైవేటు పరమైన బ్యాంకుల్లోనేమో 217.7 లక్షల కోట్ల డిపాజిట్లు అందుబాటులో వున్నాయి. అంతర్జాతీయంగా వచ్చిన అనేక ఒడుదుడుకులను భారతీయ ద్రవ్య మార్కెట్లు తట్టుకున్నాయంటే దానికి కారణం ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల పటిష్టతే. ఇప్పుడు ఈ మొత్తం విదేశీ కంపెనీల నిర్ణయాను సారం వాడు కోవచ్చున్నమాట. ఇక్కడ దోచుకుని విదేశాల్లో దాచుకోవడం శ్రమ గనక ఇక్కడ మనం దాచుకున్నవే వచ్చి నేరుగా దోచుకు పొమ్మని తలుపులు తెరచి ఆహ్వానించడమన్నమాట. కుడి ఎడమైతే పొరబాటు కాదా!

న్యాయానికి గాయం...

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ని కేంద్రం రెండోసారి గాయపర్చింది. అంటే ఆ మధ్య ఒక మతోన్మాద వకీలు న్యాయస్థానంలో సిజెఐ పై చెప్పు విసిరే దుర్మార్గానికి పాల్పడి దొరికిపోయాడుగానీ ఏ చర్యా తీసుకోలేదు. ఎక్కడెక్కడో పోస్టులు పెట్టారనీ, రాజ్యాంగ పరిధిలోనైనా విమర్శలు చేశారనీ కేసులు నమోదు చేసే పోలీసులు, ఎన్‌డిఎ ప్రభుత్వాలు స్పందించలేదు. పైగా ఆ లాయర్ ఉద్వేగం అర్థం చేసుకోవచ్చుగానీ సంయమనం పాటించాలని సన్నాయి నొక్కులు నొక్కారు. అదొక ఎత్తయితే నేరుగా కేంద్రమే ఆయనను కించపర్చే విధంగా వ్యవహరించడం మరింత దిగ్భ్రాంతి కలిగిస్తుంది. విషయమేమంటే ట్రైబ్యునళ్ల ఏర్పాటు ఎలా వుండాలనేదానిపై ఒక కేసు ఆయన నాయకత్వంలో త్రిసభ్య ధర్మాసనం విచారిస్తున్నది. దాదాపు విచారణ ముగింపు దశలో వుంది. ఈ తరుణంలో అటార్నీ జనరల్ హఠాత్తుగా ఈ కేసు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తే మంచిదని కోరారు. సిజెఐ గవాయ్ నవంబరు 23న దిగిపోతే 25న జస్టిస్ సూర్యకాంత్ ఆ పదవి చేపట్టబోతున్నారు. ఈ సమయంలో ధర్మాసనం మార్పు కోరడమంటే ప్రస్తుత సిజెఐ విచారణను అడ్డుకోవడమే. ఇదే జస్టిస్ గవాయ్ అన్నారు. కేంద్రం నన్ను ఈ కేసు విచారణ నుంచి తప్పించాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తుందే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకాలం విచారణ జరుగుతుంటే ఒక్కసారి కూడా మీరు ఇలాంటి కోర్కె కోరలేదు. నేను దిగిపోయే సమయంలో అడుగుతున్నారంటే అందుకే కదా అని సూటిగా ప్రశ్నించారు. అదేం లేదంటూనే అటార్నీ జనరల్ రమణి మళ్లీ రాజ్యాంగ ధర్మాసనం విచారించడం సమంజసంగా వుంటుందని వాదించారు. ఈ దశలో అదేం కుదరదు, మేమే కొనసాగిస్తామని సిజెఐ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ముంబయిలో నూతన హైకోర్టు భవనాలను ప్రారంభించే సమయంలోనూ ఇలాంటి నిరసన వ్యాఖ్యలే చేశారు. మనం న్యాయమూర్తులం. ఏదో ప్రభువుల్లా ప్రవర్తించకూడదు. మన సౌకర్యాల కన్నా కక్షిదార్ల సదుపాయాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. కోర్టులు ఫైవ్‌స్టార్ హోటళ్లు కారాదని ప్రకటించారు. ఏమంటేనేం. దిగిపోతున్నారు కదా.. కేంద్రం కోర్కె కూడా అదేనేమో...!

చంద్రుడిని వదిలేసి వేలు...బ్రెజిల్ మోడల్ ట్వీట్

మూర్ఖుడికి వేలు పెట్టి చందమామను చూపిస్తే ఆ వేలును చూస్తాడని సామెత. ఏదైనా ఎందుకు చెప్పారనేది వదిలేసి ముక్కస్య ముక: అన్నట్టు మాట్లాడితే అలాగే వుంటుంది. ఓట్ చోరీ యుద్ధంలో మునిగివున్న రాహుల్ గాంధీ హర్యానాలో సర్కారీ చోరీ అని కొత్త కాప్షన్ పెట్టారు. ఏదైనా ఓడిపోయాకే అనుకోండి. ఈ సందర్భంగా అక్కడ పాతిక లక్షల ఓట్లు గల్లంతయ్యాయని చెబుతూ ఒక అడ్వర్టయిజ్‌మెంట్ మోడల్ ఫోటోను ఓటర్ ఐడి లలో వాడిన ఉదంతం ఎత్తిచూపారు. బ్రెజిల్‌కు చెందిన ఆ మోడల్ పేరు లారిస్సా. ఆమె ఫోటోతో సీమా, స్వీటీ, సరస్వతి, రష్మి, విల్మా వంటి రకరకాల పేర్లతో 22 సార్లు ఉపయోగించారని ప్రతిపక్ష నేత మీడియాకు చూపించారు. ఇది నిస్సందేహంగా ఎన్నికల సంఘం తప్పు. ముందే ఎందుకు చెప్పలేదని వారు ఎదురు దాడి చేశారు. ఈలోగా సదరు లారిస్సా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'ఇండియాలో ఇంత క్రేజ్ ఏంటి? నా ఫోటో వైరల్ అయిపోయింద'ని ఇదైపోయారు. ఇక్కడ రాహుల్‌పై ఆమె విమర్శ చేసినట్టు కొన్ని మీడియాల శీర్షిక. ఇంతకూ ఆమె ఫోటో నెట్‌లో అందుబాటులో వుండటంతో తీసి ఓట్ల మోసగాళ్లు ఉపయోగించారు. దాన్నే రాహుల్ ఆధారాలతో చెప్పాక ఆ ఫోటోను తొలగించారట. ఇక్కడ భారతీయుల క్రేజ్ గానీ ఆ నటీమణి అంతగా అబ్బురపడాల్సిన విషయం గానీ ఏముంది?

- పీపీ

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

ఆదాయంపై ఆందోళన

- జిఎస్‌టి తగ్గడంతో

ప్రత్యామ్నాయాల పరిశీలన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

జిఎస్‌టి సంస్కరణ వల్ల ఆదాయం తగ్గడంపై ఆర్థికశాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలన్న కోణంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. గతంలో ఆదాయ పెంపుకోసం డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్, కొంతమంది నిపుణులు ఇచ్చిన సూచనలను ఇప్పుడు తెరపైకి తీసుకువస్తున్నారు. ఈ సూచనలు అమలు చేస్తే ప్రజలపై ఎంతో కొంత భారం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబర్ నెలకు సంబంధించిన గణాంకాల మేరకు గతేడాది కన్నా 325 కోట్లు జిఎస్‌టి తగ్గినట్లు తేలడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అలాగే సెప్టెంబర్‌కన్నా కూడా అక్టోబర్‌లో 163 కోట్లు తగ్గినట్లు తేలింది. వాస్తవానికి జిఎస్‌టి-2 ప్రకటించిన వెంటనే కనీసం ఎనిమిది వేల కోట్లు తగ్గిపోయే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేయడం తెలిసిందే. అందుకే ఈ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు కొన్ని ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. గతంలో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ కూడా ఆదాయం పెంపుకోసం కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచింది. ఇప్పుడు ఆ ప్రతిపాదనలనే ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోంది. గత కలెక్టర్ల సదస్సులో కూడా జిఎస్‌టి నష్టాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయగా, ఇప్పుడు ఆ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని మరోసారి స్పష్టం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. పెండింగ్ బకాయిలను ముక్కుపిండి వసూలు చేయడం, ఎగవేత దారులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేసి కేసులు పెట్టడం, చిరు వ్యాపారులు కూడా తప్పనిసరిగా పన్నులు చెల్లించేలా చూసేందుకు తప్పనిసరి రిజిస్ట్రేషన్లు అమలు చేయడం వంటి చర్యలను తప్పనిసరిగా అమలు చేయనున్నారని సమాచారం.

పథకాల స్థానంలో నగదు బదిలీ .?

ఇన్నాళ్లూ పథకాలు ఇస్తున్న రాయితీలపైనా మరోసారి దృష్టి సారిస్తున్నారు. గతంలోనే డిబిటి ఇచ్చిన నివేదికను ఇప్పుడు బయటకు తీసి పథకాల స్థానంలో నగదు బదిలీ చేయాలని, అది కూడా అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం దీనిపైన చర్చ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. దీనివల్ల కొంతవరకు వ్యయం తగ్గుతుందని ఆర్థికశాఖ చెబుతోంది.

మద్యం, గనులపై దృష్టి

ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో గనుల శాఖ, మద్యం శాఖలపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యంపై కొత్తగా అదనపు వ్యాట్ విధించే అవకాశాలున్నాయని ఒక అధికారి చెప్పారు. అలాగే గనుల ద్వారా వచ్చే ఆదాయం నామమాత్రంగా ఉంటోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. పర్యాటక రంగంలో కూడా ఫీజులను పెంచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని యోచిస్తున్నారు.

యువతను నాశనం చేస్తున్న వైసిపి

- హోంమంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటుంటే 'డ్రగ్స్ తీసుకో బ్రో' అని వైసిపి యువతను నాశనం చేస్తుందని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, రాష్ట్రప్రజాప్రతినిధులంతా ఏకమై విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయిని సమూలంగా అంతమొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, అందుకే ఏడాదిన్నర నుంచి ఆ దిశలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈగల్ వ్యవస్థను స్థాపించి గంజా సాగును జీరో స్థాయికి తగ్గించామని తెలిపారు. ముఖ్యమంత్రి దిశానిర్దేశంతో డ్రగ్స్ వద్దు బ్రో నినాదాన్ని స్కూల్ స్థాయికి తీసుకెళ్లామని చెప్పారు. 50వేల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ నష్టాలు, ఎన్‌డిపిఎస్ చట్టం గురించి విద్యార్థులకు తెలియజేశామని వివరించారు. వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను లక్ష్యంగా చేసి డ్రగ్స్ దందా నడిపిస్తూ ఈగల్ విభాగానికి పట్టుబడ్డారని తెలిపారు. ఇది వైసిపి అధినేత జగన్‌కు తెలియదా? ఆయనకు తెలియకుండానే కొండారెడ్డి దందా నడిపారా అని ప్రశ్నించారు. డ్రగ్స్ అలవాటు చేస్తున్న వైసిపి నాయకులతో మీటింగ్ పెడుతున్న జగన్‌కు సిగ్గు లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రయువతపై ప్రేమ ఉంటే కొండారెడ్డిని ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. వైసిపి లాంటి పార్టీలు, వ్యక్తులతో పిల్లలను ఉంచాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ దందా నడిపిస్తే ఈగల్ కన్ను గమనిస్తుందని హెచ్చరించారు.

బిజెపి కీలుబొమ్మగా మారిన ఇసిఐ : వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంస్థ కాదని, బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మోడీ మోసం మీద, ఎన్నికల సంఘం దగాపై రాహుల్ గాంధీ హైడ్రోజన్ బాంబు పేల్చారన్నారు. ఈ దొంగ ఓట్లు లేకుంటే కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచేది అని చెప్పారు. ఎన్నికల సంఘం తన బాధ్యతను విస్మరించి బిజెపి పక్షాన పనిచేస్తోందని మండిపడ్డారు. ఓటర్ జాబితా, సిసిటివి ఫుటేజ్, డిజిటల్ డేటా వంటి ఆధారాలు ఇవ్వకుండా ఎన్నికల సంఘం దాచి పెడుతోందని తెలిపారు. బిజెపికి ఎన్నికల సంఘం మరో ఆర్‌ఎస్‌ఎస్ వంటి వ్యవస్థ అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ చోర్ – గద్దీ చోర్' ప్రచారానికి ప్రజలు విశేష స్పందన చూపారని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 17.65 లక్షల మంది ప్రజలు సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారని వివరించారు. ఈ సంతకాలను డిల్లీకి పంపిస్తున్నామని చెప్పారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

- ఆర్‌ఎస్‌ఎస్ ఎడిజె న్యాయమూర్తి తీర్పు

ప్రజాశక్తి – తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్‌బీట్, చామల రేంజ్‌లోని నిషేధిత రిజర్వ్ ఫారెస్టులోకి ఎర్రచందనం కోసం 2017లో తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లాకు చెందిన రవి, గోవిందన్ వెళ్లారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు వారిద్దరినీ పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. అనాటి నుంచి కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. నేరం రుజువు కావడంతో ఆర్‌ఎస్‌ఎస్ ఎడిజె కోర్టు గురువారం తీర్పు నిచ్చింది. ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. ఆరు లక్షల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి నరసింహ మూర్తి తీర్పు నిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

'ఇ' ఎన్ఐటి నం.33/ఎస్ఇ/ఆర్ మరియు బి/ఎలక్/విజెఎ/2025-26, తేది.04.11.2025
పని పేరు: గుంటూరు జిల్లాలో విఎస్ఆర్ కాలేజి నుండి కాటెవరం బ్రిడ్జ్ వరకు సెంట్రల్ లైటింగ్ కేటాయింపు. **అంచనా విలువ :** రూ.73,45,455/-. టెండరు రసీదు చివరి తేది : 20.11.2025 ఉ.11.00 గం.లకు. తదుపరి వివరాలను www.apeprocurement.gov.in వద్ద చూడగలరు. ఫోన్.నం.9491086699, 8142284694.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు (ఆర్ మరియు బి), ఎలక్ట్రికల్ సర్కిల్, ఎ.పి.హెచ్.జి.ఎస్.విజయవాడ
DIPRNo: 17960/CL/ADVT/1/1/2021-22

kotak
కొటక్ మహీంద్రా ప్రైమ్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: 27బికెసి, సి-27, జి-బ్లాక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఇ), ముంబయి-400051.
బ్రాంచి ఆఫీసు: డోర్ నం.40-1-48/1, 2వ అంతస్తు, ఎం.జి.రోడ్, లబ్బీపేట్, సెంట్రో షోరూమ్ ప్రక్కన, ట్వీల్స్ ఎదురుగా, విజయవాడ-520010, ఆం.ప్ర.

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1))

ఏదైతే, క్రింది సంతకందారు **కొటక్ మహీంద్రా ప్రైమ్ లిమిటెడ్** (కెఎంపిఎల్) (ఇందు తదుపరి "కెఎంపిఎల్/ కంపెనీ"గా పేర్కొనబడును) యొక్క అధీకృత అధికారిగా, బోర్డు తీర్మాణం తేది 03 జులై 2024 ఆధారంగా, దీని రిజిస్టర్డు ఆఫీసు: 27 బికెసి, గ్రౌండ్ ఫ్లోర్, ప్లాట్ నం. సి-27, 'జి' బ్లాక్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర ఈస్ట్, ముంబయి-400 051 మరియు దీని ఒక బ్రాంచి ఆఫీసు: డోర్ నం.40-1-48/1, 2వ అంతస్తు, ఎం.జి.రోడ్, లబ్బీపేట్, సెంట్రో షోరూమ్ ప్రక్కన, ట్వీల్స్ ఎదురుగా, విజయవాడ-520010, ఆం.ప్ర-ఇండియా వద్ద కలిగి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తోచదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 20.08.2025** నాటి **డిమాండ్ నోటీసు** జారీచేసి, **రుణగ్రహీతలు: 1. మెసర్స్ ఎస్ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్,** ప్రతినిధియైన దీని **యజమాని శ్రీ ఐ. కోదండ రామ్,** 9-74-2/4, తమ్మిన వారి లేన్, కొత్తపేట్, అంచుముఖ ఆంజనేయ టెంపుల్ ఎదురుగా, కృష్ణా, విజయవాడ-520001, ఆం.ప్ర. **2. శ్రీ ఐ. కోదండ రామ్, తండ్రి శ్రీ శ్రీరాములు ఇలిపిల్ల,** 9-74-2/4, తమ్మిన వారి లేన్, కొత్తపేట్, అంచుముఖ ఆంజనేయ టెంపుల్ ఎదురుగా, కృష్ణా, విజయవాడ-520001, ఆం.ప్ర. **3. మిస్ ఇలిపిల్ల వైదేహి భర్త శ్రీ ఐ. కోదండ రామ్,** 9-74-2/4, తమ్మిన వారి లేన్, కొత్తపేట్, అంచుముఖ ఆంజనేయ టెంపుల్ ఎదురుగా, కృష్ణా, విజయవాడ-520001, ఆం.ప్ర. అనువారిని, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి **60 రోజుల్లోగా 11.08.2025** నాటికి (ఈ మొత్తాలు 11.08.2025 వరకు వర్తించు వడ్డీ కలుపుకొని) బకాయిగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.28,44,479.22 పై.లు** (రూపాయలు ఇరువై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల నాలుగు వందల డెబ్బై తొమ్మిది మరియు ఇరువై రెండు పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు/ తాకట్టుదారులు/ హామీదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/ తాకట్టుదారులు/ హామీదారులు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **01 నవంబర్, 2025న స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు/తాకట్టుదారులు/ హామీదారులు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని, ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **కెఎంపిఎల్** కు **11.08.2025** నాటికి (ఈ మొత్తాలు 11.08.2025 వరకు వర్తించు వడ్డీ కలుపుకొని) బకాయిగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.28,44,479.22 పై.లు** (రూపాయలు ఇరువై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల నాలుగు వందల డెబ్బై తొమ్మిది మరియు ఇరువై రెండు పైసలు మాత్రమే)లను మరియు దానిపై వడ్డీతో చెల్లించుటకు లోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తి వివరణ: ఐటెం నం.1: ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ, మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొత్తపేట్, తమ్మనవారి వీధి లోగల మున్సిపల్ వార్డు నం.8, రెవెన్యూ వార్డు నం.4, బ్లాక్ నం.10, ఎన్‌టిఎస్ నం.578, పాత అసెస్మెంట్ నం.5927, 5928, ప్రస్తుత డిజిటల్ అసెస్మెంట్ నం.1073022211, డోర్ నం.9-74-2సి తో (7.2చ.గ.ల ఉమ్మడి బాట భవనముతో 53.2చ.గ.లు) దానిలో ఆర్‌సిసి భవనముతోపాటు 60.4చ.గ.లు లేదా 50.50చ.మీ.ల విస్తీర్ణపు సైటు. భవనముతో 53.2చ.గ.లకు సరిహద్దులు: **తూర్పు:** కొంత విస్తీర్ణంతో 1వ ఐటెం & 51.11అ.ల కొంత విస్తీర్ణంతో ఇలిపిల్ల రఘురామ్ ఆస్తి, **పడమర:** ఉమ్మడి బాట; 25.11అ.లు, **ఉత్తరం:** మారుపిల్ల లక్ష్మణ స్వామి ఆస్తి; 18.6అ.లు; **దక్షిణం:** ఇలిపిల్ల రఘురామ్ ఆస్తి; 18.6అ.లు; 7.2చ.గ.ల ఉమ్మడి బాట కొరకు సరిహద్దులు: **తూర్పు:** కొత్త గంగాధర రావు ఆస్తి; 25.11అ.లు; **పడమర:** ఇలిపిల్ల వెంకట జయరామ్, మారుతి రామ్ ఆస్తి; 51.11అ.లు; **ఉత్తరం:** మారుపిల్ల లక్ష్మణ స్వామి ఆస్తి; 5అ.లు, **దక్షిణం:** తమ్మనవారి వీధి అనగా మున్సిపల్ వీధి; 5అ.లు. **ఐటెం నం.2:** ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ జిల్లా, విజయవాడ, కొత్తపేట మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, తమ్మనవారి వీధి లోగల మున్సిపల్ వార్డు నం.8, రెవెన్యూ వార్డు నం.4, బ్లాక్ నం.10, ఎన్‌టిఎస్ నం.578, పాత అసెస్మెంట్ నం.5927, 5926, 5928, 51532, ప్రస్తుత డిజిటల్ అసెస్మెంట్ నం.1073022212, డోర్ నం.9-74-2తో (భవనముతో 53.2చ.గ.లు + 7.2చ.గ.ల ఉమ్మడి బాట) దానిలో ఆర్‌సిసి భవనముతో 60.4చ.గ.లు లేదా 50.50చ.మీ.ల విస్తీర్ణపు సైటు. 53.2చ.గ.ల కొరకు భవనముతో సరిహద్దులు: **తూర్పు:** కొత్త గంగాధర రావు ఆస్తి; 25.11అ.లు, **పడమర:** ఉమ్మడి బాట; 25.11అ.లు; **ఉత్తరం:** ఇలిపిల్ల కోదండ రామ్ ఆస్తి; 18.6అ.లు, **దక్షిణం:** తమ్మనవారి వీధి అనగా., మున్సిపల్ వీధి; 18.6అ.లు; 7.2చ.గ.ల ఉమ్మడి బాట కొరకు సరిహద్దులు: **తూర్పు:** కొంత విస్తీర్ణంతో 1వ ఐటెం & ఇలిపిల్ల కోదండ రామ్ ఆస్తి, **పడమర:** ఇలిపిల్ల వెంకట జయరామ్, మారుతి రామ్ ఆస్తి; 51.11అ.లు,. **ఉత్తరం:** మారుపిల్ల లక్ష్మణ స్వామి ఆస్తి; 5అ.లు; **దక్షిణం:** తమ్మనవారి వీధి అనగా,. మున్సిపల్ వీధి; 5అ.లు. దానికి అనుబంధ అన్ని ఈజిమెంటరీ/ మామూలు హక్కులు మరియు ప్రస్తుత& భవిష్యత్ రెండింటి, నేలకు అటాచ్‌చేయబడిన ఏదేని పర్మినెంట్లీ ఫాస్టెనెడ్ లేదా నేలకు అటాచ్‌చేయబడిన అన్ని భవనాలు & నిర్మాణాలతోసహా.

తేది: 01.11.2025, ప్రదేశం: విజయవాడ.
సం/- అధీకృత అధికారి, కొటక్ మహీంద్రా ప్రైమ్ లిమిటెడ్.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్
(యూనివర్శిటీగా భావించబడింది)
AACSB ACCREDITED

AACSB అక్రెడిటెడ్

పూర్తి సమయం ఎంబిఏ
2026-28 ప్రోగ్రామ్‌లకు ప్రవేశపు ప్రకటన

భారత ప్రభుత్వ వాణిజ్యం మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ 1963లో స్థాపించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి), భారతదేశంలోని బాహ్య వాణిజ్య రంగానికి నైపుణ్యాభివృద్ధికి ప్రసిద్ధి చెందిన దేశంలోని అగ్రశ్రేణి వ్యాపార పాఠశాలలలో ఒకటి. ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రతిష్ఠాత్మకమైన AACSB అక్రెడిటేషన్ మరియు "A+ NAAC ర్యాంకింగ్‌తో కూడిన డీమ్డ్ టు బి యూనివర్సిటీ.
ఐఐఎఫ్‌టి తదుపరి 2 సంవత్సరాల పూర్తి సమయం ఎంబిఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తును ఆహ్వానిస్తోంది:

1) ఢిల్లీ, కోల్‌కతా, కాకినాడ మరియు జిఐఎఫ్‌టి సిటీ క్యాంపస్‌లలో ఎంబిఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) 2026-28 ప్రోగ్రామ్.

2) ఢిల్లీ క్యాంపస్‌లో ఎంబిఏ (బిజినెస్ అనలిటిక్స్) 2026-28 ప్రోగ్రామ్

ముఖ్యమైన సమాచారం:

ప్రవేశం ద్వారా:	ఎంపిక ప్రమాణాల ప్రకారం క్యాట్ 2025 స్కోరు మరియు ఇతర నిర్వచించిన పారామితులు.
రిజర్వేషన్లు	SC/ST/PwD/OBC(NCL)/EWS/ రిజర్వేషన్లు భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలు	17.10.2025 నుండి 28.11.2025 వరకు
దరఖాస్తు రుసుము	MBA(IB) కోసం -రూ.3000/- (SC/ST/PwD/ట్రాన్స్‌జెండర్ కోసం రూ.1500/-) MBA(BA) కోసం - రూ.2000/- (SC/ST/PwD/ట్రాన్స్‌జెండర్ కోసం రూ.1000/-)

IIFT పైన పేర్కొన్న ప్రోగ్రామ్(ల) కోసం అభ్యర్థులను షార్ట్-లిస్ట్ చేయడానికి/ఎంపిక చేయడానికి CAT 2025 స్కోర్‌ను ఉపయోగిస్తుంది. ఎంపిక ప్రక్రియలో లేదా ప్రోగ్రామ్ నిర్వహణలో ఐఐఎంలకు ఎటువంటి పాత్ర లేదు.
అర్హత, ప్రవేశం, ఎంపిక ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు ఐఐఎఫ్‌టి వెబ్‌సైట్: www.iift.ac.in లో అందుబాటులో ఉన్న ప్రాస్పెక్టస్‌లో పేర్కొనబడ్డాయి. ఆసక్తిగల అభ్యర్థులు ఐఐఎఫ్‌టి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏవేని వివరణల కోసం, దయచేసి అడ్మిషన్స్ సెల్‌లో నెంబరు 011-39147213/ 9773698083లో సంప్రదించండి లేదా admission@iift.edu కు వ్రాయండి.

గౌరవ్ గులాటి, రిజిస్ట్రార్

CBC 05103/12/0010/2526

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — భారత ప్రభుత్వ రంగ సంస్థ
ప్రాంతీయ కార్యాలయము, విజయవాడ

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించుటలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారునగలు **ది. 14-11-2025, శుక్రవారం, సాయంత్రం 04.00 గం॥లకు** ఈ క్రింది బ్రాంచీల ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది. 14-11-2025, మధ్యాహ్నం 02.00 గం॥లలోపు తమ గుర్తింపుకార్డును చూపి రూ. 5,000/- లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయి రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చులు కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బయాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ. సం.	లోను ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాముల్లో
	సిరీస్ బ్రాంచి - ఫోన్ : 8500030494		
1.	110916630000884	షేక్ ఖమర్	13.30
2.	110916630002211	వల్లభనేని సుమన్	35.00
	మాచవరం బ్రాంచి - ఫోన్ : 8341981631		
1.	037116530003245	కర్రి అచ్చయ్య	12.00
	విజయవాడ ఆర్.ఆర్. అప్పారావు వీధి బ్రాంచి - ఫోన్ : 9966331855		
1.	060616540000926	ఏనుగుదాటి జగ్గరాజు	29.40
	కంచికచర్ల బ్రాంచి - ఫోన్ : 8985810549		
1.	137516540008165	ఆవుల శ్రీనివాసరావు	54.00
2.	137516540008751	ఆవుల శ్రీనివాసరావు	43.00
3.	137516540008750	ఆవుల శ్రీనివాసరావు	22.00
	ఎనికేపాడు బ్రాంచి-విజయవాడ - ఫోన్ : 9918509222		
1.	329806630004136	నందమూరి లీలాకృష్ణ	4.10
	నిడమానూరు బ్రాంచి - ఫోన్ : 8074610330		
1.	087716630000482	వేముల సుస్మిత	11.70
	నున్న బ్రాంచి - ఫోన్ : 959797308		
1.	144416630003228	నార్నపాటి సుజిని	89.00
2.	144416540005883	నార్నపాటి సుజిని	58.00
3.	144416630003227	నార్నపాటి సుజిని	29.00
4.	144416630002567	కట్టుబోయిన మేరీకుమారి	47.00
	ఇబ్రహీంపట్నం బ్రాంచి - ఫోన్ : 9918509222		
1.	102716630001677	కొరవి ప్రకాశ్	19.30
2.	560656001926743	కొరవి ప్రకాశ్	19.30

తేది. 06-11-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విజయవాడ

IDBI BANK
CIN: 65190MH2004GOI148838
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ 3వ అంతస్తు, డి. నెం: 5-9-89/1 మరియు 2, చాపెల్ రోడ్, హైదరాబాద్-500001, తెలంగాణ, 040-67694053/67694111. ఇ-మెయిల్: dv.krishna@idbi.co.in

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI యాక్ట్) క్రింద నోటీసు

రుణగ్రహీత మరియు తనఖాదారు పేరు:
1) రుణగ్రహీత: శ్రీమతి మీనాక్షి బోదన్న చంద్రయ్య, ప్లాట్ నెం.8-2-693/2/3/సి-51 రోడ్ నెం.12 మిథిలా నగర్ ఖైరతాబాద్ పి.ఒ. హైదరాబాద్ తెలంగాణ-500034 **మరియు:** 8-1-284/412, ఓయూ కాలనీ షేక్‌పేట్, ఆర్ఆర్ జిల్లా పిన్-500010, **హామీదారు: శ్రీ. మోహన్ కుమార్ వెంకటేష్ బాబు, కేరాఫ్ వెంకటేష్ బాబు,** ఎస్ వార్డ్ నెం.13 వీరాంజనేయ టెంపుల్ స్ట్రీట్, సొన్నశెట్టిహోలి, చింతామణి, చిక్కబల్లాపూర్ కర్ణాటక-563125 **మరియు :** ఫ్లాట్ నెం. 205, సిరి గ్రీన్ జ్యువెల్ అపార్ట్‌మెంట్స్ తాడేపల్లి గుంటూరు **ఎ.పి.-522501.**

పైన తెలిపిన రుణగ్రహీత మరియు తనఖాదారు లకు ఈ నోటీసు లో తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన రుణగ్రహీతకు గృహ రుణము ద్వారా ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ **(ఐడిబిఐ బ్యాంక్)** నుండి ఆర్థిక సహాయముగా **రూ.79,11,813.00 (రూపాయలు డెబ్బై తొమ్మిది లక్షల పదకొండు వేల ఎనిమిది వందల పదమూడు మాత్రమే),** మంజూరు చేయబడినదని, మరియు పై సదరు ఆర్థిక సహాయం, అవసరమైన రుణ మంజూరుకు అనుగుణంగా పై తెలిపిన రుణగ్రహీత మరియు తనఖాదారుల ద్వారా సెక్యూరిటీ డాక్యుమెంట్లను అమలు పరిచినారు. దిగువ తెలియజేయబడిన ఆస్తుల హక్కు దస్తావేజులు **(సెక్యూర్డ్ అస్సెట్)** దాఖలు చేసి తనఖా పెట్టుట ద్వారా ఇతరములతో కలుపుకొని సదరు ఆర్థిక సహాయం అందజేయబడినది. రుణ ఒప్పందము తేది **30.01.2024 మరియు 30.01.2024** నిబంధనలకు అనుగుణంగా సదరు ఆర్థిక సహాయం తిరిగి చెల్లించుటలో పైన తెలియజేయబడిన సదరు రుణగ్రహీత విఫలమైనందున సమయానుసారంగా **రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే** జారీ చేయబడిన మార్గదర్శకాల ప్రకారం ఐడిబిఐ బ్యాంక్ ఖాతా పుస్తకాలలో రుణగ్రహీతల యొక్క **ఖాతా తేది: 08.08.2025 నాటికి నిరర్థక ఆస్తులు** (ఎన్‌పిఎ)గా వర్గీకరించబడినవి. పై సదరు రుణగ్రహీతలచే వైఫల్యముల కారణముగా ఐడిబిఐ బ్యాంక్ రిఫరెన్స్ నెం. LRN105710238833622067 **తేది: 02 సెప్టెంబర్, 2025** కలిగిన దాని లెటర్ ప్రకారం **తేది: 10.07.2025** నాటికి వడ్డీతో సహా మరియు ఇతర నగదులతో కలుపుకొని **రూ. 79,30,281.35 (రూపాయలు డెబ్బై తొమ్మిది లక్షల ముప్పై వేల రెండు వందల ఎనభై ఒకటి మరియు పైసలు ముప్పై ఐదు మాత్రమే)** లు రుణగ్రహీతల నుండి వెంటనే రావల్సియున్నది మరియు రుణగ్రహీతలచే చెల్లించవలసియున్నది. **తేది: 14.09.2025** నాటికి **రూ. 80,56,744.35/- (ఎనభై లక్షల యాభై ఆరు వేల ఏడు వందల నలభై నాలుగు రూపాయలు మరియు పైసలు ముప్పై ఐదు మాత్రమే)** చెల్లింపు/వసూళు అయ్యే తేదీ వరకు ఒప్పంద రేటు వంతున దానిపై తదుపరి వడ్డీతోపాటు ఐడిబిఐ బ్యాంక్‌కు రుణగ్రహీత బకాయి ఉన్నారు మరియు చెల్లించవలసి వున్నది.

తిరుగు రసీదుతోపాటు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా రిఫరెన్స్ నెం. IDBI/RR-Hyd/SOL-1057/2025-26/622 తేది: 25.09.2025 ప్రకారం రుణగ్రహీత మరియు తనఖాదారుకు సంబంధిత చిరునామాలకు SARFAESI యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ఐడిబిఐ బ్యాంక్‌చే అవసరమైన విధంగా నోటీసు జారీ చేయబడినది/పంపబడినది మరియు అవి బట్వాడా కాకుండగానే పోస్టల్ రిమార్క్ తో "ఈ చిరునామాలో అట్టి వ్యక్తి లేరు/సరైన చిరునామా కాదు/ ఇం.నం. ప్లాట్ నం. లేదు అని తిరిగి వచ్చినవి. పైన తెలియజేయబడిన సదరు కారణాల దృష్ట్యా SARFAESI రూల్స్ యొక్క రూల్ 3(1) నిబంధనలకు అనుగుణంగా ఈ బహిరంగ ప్రకటన జారీ చేయడమైది.

ఐడిబిఐ బ్యాంక్ వారి ముందస్తుగా వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండగా సెక్యూర్డ్ ఆస్తులలో దేనినైననూ మీరు బదిలీ చేయరాదు లేదా మరేవిధంగానైననూ (మీ వ్యాపార సాధారణ లావాదేవీలు కానీ మరేవిధంగా) బదిలీ చేయరాదని గమనించవలసిందిగా కోరడమైనది. అటులగాక విఫలమైనచో SARFAESI యాక్ట్ యొక్క సెక్షన్ 29 క్రింద మీరు శిక్షార్హులు. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటలో లభ్యతనందు గల సమయమునకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 నందలి ఉప సెక్షన్ (8) క్రింద నిబంధనలు గమనించవలసిందిగా మీ దృష్టికి తీసుకురావడమైనది.

కింద సంతకం చేసిన వ్యక్తి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనం చేయబడింది) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద, మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని [నియమం 3]తో చదవబడిన ఆ చట్టంలోని సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ డిమాండ్ నోటీసులు జారీ చేశారు, ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు క్రింద జోడించిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని డిమాండ్ నోటీసు తేదీ నుండి చెల్లింపు/రియలైజ్ అయ్యే వరకు తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో సహా తిరిగి చెల్లించాలని రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులు జారీ చేశారు..
రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలలోని 8వ నియమాన్ని చదువుతూ చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని కింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారులు మరియు ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడుతోంది.

లోను అకౌంట్ నెం	రుణగ్రహీత/లు/సహ-రుణగ్రహీత/లు మరియు హామీదారుల పేరు	తనఖా ఆస్తుల వివరణ	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు బకాయి మొత్తం(రూ.)	స్వాధీనత తీసుకోబడిన తేది మరయు విధం
64655945 & 114021775	1. సైకం నవీన్, 2. సైకం వెంకటేశ్వరమ్మ	ఖాళీ స్థలం మరియు ఆర్‌సిసి భవనం యొక్క ఆ భాగం మరియు పార్శిల్ 91.50 చ.గజాలు లేదా 76.50 చ.మీటర్లు డోర్.నం.30/730-1, ఆర.ఎస్.నం.247/2, రెవెన్యూ వార్డు నం.3, ఉల్లింగపాలెం, మచిలీపట్నం, క్రుష్ణా జిలా, మచిలిపట్నం సబ్-రిజిస్ట్రీ, ఆంధ్రప్రదేశ్-521001 వద్ద వుంది. మరియు **సరిహద్దు: తూర్పు: అవనిగడ్డ వెంకటేశ్వరరావు మరియు ఇతరుల సైటు, 25.6 అ.గు.లు, పడమర: జాయింట్ పాసేజ్,25.6 అ.గు.లు, ఉత్తరం: సైకం వెంకటేశ్వరరావు మరియు ఇతరుల సైటు,30.3 అ.గు.లు, దక్షిణం: సైకం వెంకటేశ్వరరావు మరియు ఇతరుల సైటు, 34.9 అ.గు.లు**	08.08.2025	Rs. 5,90,038.68/-	03.11.2025 స్వాధీనత
79473249	1. వేముల ప్రసాద్, 2. సునీతా రాణి వేముల,	ఖాళీ స్థలం యొక్క ఆ భాగం మరియు పార్శిల్ విస్తీర్ణత 75 చ.గజాలు, 62.7 చ.మీటర్లు ఆర్.ఎస్.నం.343/1 డోర్.నం.16/373-5-1ఎలో, వల్లందపాలెం, మచిలిపట్నం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్ మచిలీపట్నం ఎస్.ఆర్.ఒ పరిధిలో, మాధవరం శివారు వలందపాలెం, మరియు **సరిహద్దు:-తూర్పు: అనుమకొండ వెంకటేశ్వరరావు యొక్క సైటు-45 అ.గు.లు., పడమర: ఆరెపల్లి అంజయ్య-45 అ.గ.లు., ఉత్తరం: పోతెపల్లి రోడ్డు 15 అ.గు.లు., దక్షిణం: అనుమకొండ వెంకటేశ్వరావు యొక్క సైటు, 15 అ.గు.లు.**	08.08.2025	Rs. 5,68,362.26/-	03.11.2025 స్వాధీనత
143183725	1. దేవరపల్లి రాజ్యలక్ష్మి, 2. దేవరపల్లి వేణు,	ఆ భాగం మరియు పార్శిల్ విస్తీర్ణత 463 చదరపు గజాలు మొత్తం సైటు మరియు దీనిని రెండు వస్తువులుగా విభజించారు, వీటిలో ఒకటి 355 చదరపు గజాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు, బేరింగ్ డోర్ నం.3-107, ఇది అంశం నం.1 గా చూపబడింది. మరియు స్థిరాస్తి మార్గం సైట్ యొక్క 108 చదరపు గజాల విస్తీర్ణం అంశం సంఖ్య 2 గా చూపబడింది. ఆర్.ఎస్.నం.84-1డి ఈదులగూడెం గ్రామం, హెచ్ఒ ఈదులగూడెం గ్రామం, ఆగిరిపల్లి రెవెన్యూ మండలం, ఏలూరు జిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రీ పరిధిలో, ఆంధ్రప్రదేశ్-521211 వద్ద వుంది. అంశం నం.1 సరిహద్దు:- తూర్పు: అంశం నం. 2 యొక్క మార్గంలో కొంత భాగం, మరియు పెనుముచు మావో యొక్క ఇల్లు మరియు స్థలంలో కొంత భాగం - 49.6 అడుగులు., పడమర: సగ్గుర్తి వెంకటేశ్వరరావు యొక్క ఇల్లు మరియు సైటు-48.6 అ.గు.లు., ఉత్తరం: పెనుముచు పుల్లయ్య యొక్క ఇల్లు మరియు సైటు-65.6 అ.గు.లు., దక్షిణం: పెనుముచు సాంబయ్య యొక్క ఇల్లు మరియు సైటు-65.0 అ.గు.లు. అంశం నం.2 **సరిహద్దు:-తూర్పు: నూజివీడు నుండి విజయవాడకు వయా ఈదులగూడెం యొక్క ఆర్ మరియు బి రోడ్డు- 12.0 అ.గు.లు., పడమర: అంశం నం.1 యొక్క ఆస్తి-12.0 అ.గు.లు. ఉత్తరం: నిమ్మకూరి సుగుణా రావు యొక్క సైటు-81.0 అ.గు.లు., దక్షిణం: పెనుముచు మావు యొక్క ఆస్తి-81.0 అ.గు.లు.**	19.07.2025	Rs. 10,75,713.87/-	03.11.2025 స్వాధీనత

ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణంగా ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తానికి **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనం చేయబడినవి)** ఛార్జీకి లోబడి ఉంటాయి, డిమాండ్ నోటీసు తేదీ నుండి చెల్లింపు/రియలైజేషన్ వరకు తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో పాటు. అనుమతి లేదు.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో విలీనమైంది)
తేది : 03.11.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్

ఓటు హక్కుకు భిన్నంగా స్వేచ్ఛా ఓటింగ్

- సుప్రీంలో కేంద్రం వాదన

న్యూఢిల్లీ : ఒక ఎన్నికలో 'ఓటు వేసే హక్కు', 'స్వేచ్ఛా ఓటింగ్' కంటే భిన్నంగా వుంటుందని సుప్రీంకోర్టులో కేంద్రప్రభుత్వం వాదించింది. ఇందులో మొదటిది కేవలం చట్టబద్ధమైన హక్కు అయితే, రెండోది ప్రాథమిక హక్కు అయిన భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగమని పేర్కొంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ముందు ఈ కేసు గురువారం విచారణకు లిస్ట్ అయింది. కానీ బెంచ్ సమావేశం కాలేదు. గురువారం నాడే బీహార్ అసెంబ్లీ తొలి దశ పోలింగ్ జరగడం కూడా గమనార్హం. ఎలాంటి పోల్ నిర్వహించకుండా రిటర్నింగ్ ఆఫీసర్ ఇచ్చిన డిక్లరేషన్ వల్ల ప్రజలు నోటా ఆప్షన్‌కు ఓటు వేసే హక్కును ఉపయోగించుకోలే కపోయారని పిటిషనర్లు వైది సెంటర్ ఫర్ లీగల్ పాలసీ, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున న్యాయవాదులు హర్ష పరాశర్, ప్రశాంత్ భూషణ్, నేహా రథి వాదించారు. ఎలాంటి పోల్ చేపట్టకుండా ఒక అభ్యర్థిని గెలుపొందినట్లు డిక్లేర్ చేయడమనేది నోటాకు ఓటు వేయడం ద్వారా తమ అసంతృప్తిని తెలియచేయడానికి ఓటర్లకు గల హక్కును ఉల్లంఘిస్తుందా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ రెండూ స్పందించాయి.

దీనిపై ఓటు హక్కు, స్వేచ్ఛా ఓటింగ్‌కు మధ్య గల తేడాను వివరిస్తూ కేంద్రం అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఓటు హక్కు అనేది ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 62 కింద కల్పించబడిన చట్టబద్ధమైన హక్కు అని పేర్కొంది. ఓటు వేసే స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణ కింద గల భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగమని పేర్కొంది. ఈ తేడాను వివరిస్తూ కేంద్రం, 2003 నాటి సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీం కోర్టు తీర్పును ఉటంకించింది.

ప్రభుత్వ బ్యాంక్‌ల జోలికి రావొద్దు..!

- ప్రయివేటీకరణతో దేశానికి విఘాతం
- ప్రాధాన్యత రంగాలకు పిఎస్‌బిలే దన్ను
- నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై బ్యాంక్ యూనియన్ల ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ప్రయివేటీకరణపై ఆందోళనలు అవసరం లేదని.. దేశానికి ఎలాంటి విఘాతం కలుగదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై బ్యాంకింగ్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశానికి ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంతో సేవ చేస్తున్నాయని గుర్తు చేశాయి. ప్రాధాన్యత రంగాలకు ప్రభుత్వ రంగ బ్యాంక్‌లే మద్దతుగా నిలుస్తున్నాయని.. అలాంటి బ్యాంకులను ప్రయివేటీకరించాలనే ఉద్దేశాలు మానుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వ బ్యాంక్‌లకు మరింత మూలధన సాయం అందించి వాటిని బలోపేతం చేయాలని తొమ్మిది బ్యాంకింగ్ సంఘాలతో కూడిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 1969లో జరిగిన బ్యాంకుల జాతీయీకరణ వల్ల అనుకున్న ఫలితాలు రాలేదని మంత్రి సీతారామన్ బుధవారం ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. జాతీయీకరణ జరిగిన 50 ఏళ్ల తర్వాత కూడా అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయాయని విమర్శించారు. ప్రయివేటీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరి దగ్గరకూ తీసుకెళ్లలేమన్నది తప్పుడు ఆలోచన అని పేర్కొన్నారు. మంత్రి ఈ వ్యాఖ్యలపై తాజాగా యుఎఫ్‌బియు భగ్గుమంది.

ప్రయివేటీకరణతో కార్పొరేట్లకు ప్రయోజనం

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పిఎంజెడివై) కింద 90 శాతం ఖాతాలు ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే తెరుచుకున్నాయని యుఎఫ్‌బియు తెలిపింది. ప్రాధాన్యత రంగాలకు, ప్రభుత్వ పథకాలు ఈ బ్యాంకుల ద్వారానే అందుతున్నాయని తెలిపింది. గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత ప్రభుత్వ రంగ బ్యాంకులతోనే సాధ్యమైందని పేర్కొంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఇంతటి పటిష్ఠంగా ఉండడానికీ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లే కారణమని యుఎఫ్‌బియు తెలిపింది. అలాంటి సంస్థలను ప్రయివేటీకరించడం ద్వారా దేశ ప్రయోజనాలకు విఘాతం జరుగుతుందని హెచ్చరించింది. ఉద్యోగ భద్రతతో పాటు, ప్రజల సొమ్ముకూ భద్రత ఉండబోదని తెలిపింది. ప్రయివేటీకరణ వల్ల కార్పొరేట్లకే తప్ప సాధారణ ప్రజలకు ప్రయోజనం ఉండబోదని తెలిపింది. జాతీయీకరణ కంటే ముందు బ్యాంకులు పారిశ్రామిక వేత్తలు, బడా వ్యాపార సంస్థలకు మాత్రమే సేవలందించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రభుత్వ బ్యాంక్‌లు మాత్రమే రైతులు, చిన్న వ్యాపారులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు, గ్రామీణ ప్రాంత రైతులకు రుణాలు ఇస్తున్నాయని స్పష్టం చేసింది. ఆర్థిక మాంద్యం, కరోన వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రభుత్వరంగ బ్యాంకులు దేశానికి మద్దతుగా నిలిచాయని గుర్తు చేసింది.

పార్లమెంట్‌లో చర్చ జరపాలి..

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రయివేటీకరించబోమని కేంద్రం హామీ ఇవ్వాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది. మూలధనం, టెక్నాలజీ ఆధునికీకరణ, పారదర్శక పాలన ద్వారా బ్యాంకులను మరింత బలోపేతం చేయాలని కోరింది. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరింది. డిపాజిటర్లు, ఉద్యోగులు, సాధారణ పౌరులపై ప్రభావం చూపే ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకునే ముందు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడంతో పాటు పార్లమెంట్ వేదికగానూ చర్చ జరగాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది.

రాష్ట్రపతి తన సంతకంతో కూడిన జెర్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

యువ క్రికెటర్లకు స్ఫూర్తి

- జెర్సీలపై రాష్ట్రపతి సంతకం

న్యూఢిల్లీ : ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా ఆటగాళ్లు రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ము‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము.. మహిళా క్రికెటర్లు సాధించిన ఈ విజయం యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తుందని, వేర్వేరు ప్రాంతాలు, వేర్వేరు జాతులనుంచి వచ్చిన ఆటగాళ్లు జట్టుగా ట్రోఫీ సాధించడంలో ముఖ్యపాత్ర పోషించడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మహిళల క్రికెట్ చరిత్రలో తొలిసారి ఐసిసి ట్రోఫీని సాధించిన భారతజట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గ్రహీత దీప్తి శర్మలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మహిళా క్రికెటర్లు ధరించిన జెర్సీలపై సంతకాలు చేశారు. తొలుత టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డే ప్రపంచకప్ ట్రోఫీని రాష్ట్రపతి అందజేశారు. బుధవారం భారత మహిళల జట్టు ప్రధాని నరేంద్ర మోడీని ఆయన నివాసంలో కలువగా.. రాబోయే తరానికి, ప్రత్యేకంగా బాలికలకు 'ఫిట్ ఇండియా' మూవ్‌మెంట్‌కు క్రికెటర్లు స్ఫూర్తిగా నిలిచారని పొగడ్తలతో ముంచెత్తారు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాపై 52పరుగుల తేడాతో గెలిచి తొలిసారి వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితుల వాదనలు పూర్తి

- 11నుండి పోలీసుల వాదనలు ప్రారంభం

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన విస్తృత కుట్ర కేసులో బెయిల్ కోసం ఆరుగురు నిందితులు చేసిన వాదనలు గురువారం సుప్రీంకోర్టులో ముగిశాయి. ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షాదాబ్ అహ్మద్, మహ్మద్ సలీమ్ ఖాన్‌ల వాదనలను జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన బెంచ్ విందే. ఢిల్లీ పోలీసులు మంగళవారం (11వ తేదీ) నుండి తమ వాదనలు ప్రారంభిస్తారు. గురువారం నాటి విచారణలో షాదాబ్ అహ్మద్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ వాట్సాప్ చాట్‌లను చూసినట్లైతే, ఏ చాట్‌లోనూ తన క్లయింట్ భాగస్వామి కాదని కనిపిస్తోందని చెప్పారు. తన క్లయింట్ బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చినపుడు తమ వైపు నుండి ఎలాంటి జాప్యం కూడా జరగలేదని అయినా న్యాయం జరగడం లేదని అన్నారు. 27ఏళ్ల తన క్లయింట్ ఎన్‌డిఎస్ ఎంటర్‌ప్రైజెస్‌లో సూపర్‌వైజర్‌గా 2016 నుండి పనిచేస్తున్నారని చెప్పారు. దీంతో పిటిషనర్ల వాదనలు పూర్తయ్యాయి. సెప్టెంబరు 2నాటి ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఖలీద్ తదితరులు సుప్రీంను ఆశ్రయించారు. దాంతో సెప్టెంబరు 22న ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు జారీ చేసింది.

అప్పటి ప్రతిపాదిత పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో ఢిల్లీల్లో అల్లర్లు చోటు చేసుకున్నాయి. యుఎపిఎ, ఐపిసిలోని పలు నిబంధనల కింద ఈ కేసులో ఎఫ్‌ఐఆర్‌ను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం నమోదు చేసింది. నిందితుల్లో చాలామందిపై అనేక ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. దాంతో వేర్వేరు కోర్టుల్లో పలు బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి. చాలామంది 2020 నుండి కస్టడీలోనే వున్నారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీలో ఎస్‌ఎఫ్‌ఐ విజయభేరి

- ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ అభినందనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయం సాధించింది. రెండు దశల్లో జరిగే విద్యార్థి సంఘ ఎన్నికల్లో మొదటి దశలో ఎస్‌ఎఫ్‌ఐ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని క్యాంపస్‌లలోనూ గెలుపొందింది. కారైకల్ క్యాంపస్, పాండిచ్చేరి కమ్యూనిటీ కళాశాల, మాహే క్యాంపస్, అండమాన్ పోర్ట్ బ్లెయిర్ క్యాంపస్‌లతోపాటు ఐసిసి సీట్లలో ఎక్కువ స్థానాలను గెలుచుకుంది. పాండిచ్చేరి యూనివర్శిటీ విద్యార్థి సంఘ ఎన్నికల్లో తొలుత కౌన్సిలర్ పదవులకు, రెండో దశలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులతో పాటు ఇతర స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. గురువారం విడుదలైన మొదటి దశ ఎన్నికల ఫలితాల్లో 117 కౌన్సిలర్ స్థానాలకు 68 స్థానాలను ఎస్‌ఎఫ్‌ఐ సొంతం చేసుకుని భారీ విజయాన్ని సాధించింది. సంఘ్ పరివార్ నిరంకుశ పరిపాలనకు, విద్యార్థులపై దాడులకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి సంఘాన్ని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ అభినందించింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల సంఘం మొదటి దశ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి సంఘాన్ని ఎస్ఎస్‌ఐ అభినందిస్తోందని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐని ఓడించడానికి, ఎబివిపిని గెలిపించడానికి విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం యత్నించిందని, విద్యార్థుల కుటుంబ సభ్యులను పిలిచి బెదిరింపులకు పాల్పడిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ, ప్రగతిశీల సంఘాల పోరాటం మరింత శక్తివంతంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి సంఘ నేతల విజయోత్సాహం

అవి నా ఫొటోలే..

- రాహుల్‌గాంధీ విమర్శలపై స్పందించిన బ్రెజిల్ మోడల్

న్యూఢిల్లీ : హర్యానాలో పది బూత్‌ల్లో నకిలీ ఓట్ల కోసం బ్రెజిల్ మోడల్ లారిస్సా ఫొటోలను ఉపయోగించారని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ చేసిన విమర్శలపై ఆమె స్పందించారు. ఆ ఫోటోలు తనవేనని, తన పాత ఫొటోలను దుర్వినియోగం చేశారనే విషయం తనకు తెలియదని లారిస్సా తెలిపారు. భారత్‌లో ఎన్నికల గురించి తనకు ఏమీ తెలియదని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. పోర్చుగీస్ భాషలో ఆమె మాట్లాడారు. హర్యానా ఓటర్ల జాబితాలో తన ఫోటోను అనేక సార్లు ఉపయోగించారనే విషయం తెలిసి తాను దిగ్భ్రాంతికి గురైనట్లు లారిస్సా వెల్లడించారు. తన 18, 20 ఏళ్ల వయసులోని ఫొటోలను వినియోగించారని తెలిపారు. తన ఫోటోను ఓటర్ల జాబితాలో ఉపయోగించిన విషయం ఒక విలేకరి ద్వారా తనకు తెలిసిందని చెప్పారు. ముందుగా తాను పనిచేస్తున్న సెలూన్‌కి ఫోన్ చేశారని, తాను పట్టించుకోలేదని తరువాత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విషయాన్ని వెల్లడించారని చెప్పారు.

జి-20 సదస్సుకు వెళ్లను !

- టారిఫ్‌లు లేకపోతే అమెరికాకు రక్షణ ఏది? : ట్రంప్ వ్యాఖ్యలు

న్యూయార్క్ : ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికాలో జరగనున్న జి-20 సదస్సుకు తాను హాజరు కాబోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. 'నేను వెళ్లడం లేదు. జి సమావేశాల్లో దక్షిణాఫ్రికా ఇకపై వుండకూడదు. ఎందుకంటే అక్కడ జరిగింది సరైంది కాదని' ట్రంప్ వ్యాఖ్యానించారు. తాను రావడం లేదని వారికి ఇప్పటికే చెప్పానన్నారు. అమెరికా తరపున తాను ప్రాతినిధ్యం వహించే ప్రశ్నే లేదన్నారు. మియామిలో బుధవారం అమెరికా బిజినెస్ ఫోరం సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. గతేడాది డిసెంబరు 1న జి-20 అధ్యక్ష బాధ్యతలను దక్షిణాఫ్రికా చేపట్టింది. జోహాన్నెస్‌బర్గ్‌లో నవంబరు 22,23 తేదీల్లో జి20 నేతల సమావేశానికి ఆతిథ్యం ఇస్తోంది. ఆఫ్రికా గడ్డపై జి 20 సమావేశాలు జరగడం ఇదే మొదటిసారి. జి-20కి భారత్ అధ్యక్షత వహించిన కాలంలో ఆఫ్రికన్ యూనియన్ సభ్య దేశంగా చేరింది.

రక్షణే లేదు

ఇతర దేశాలపై తాను విధించిన టారిఫ్‌లను సుప్రీంకోర్టు కొట్టివేస్తే అమెరికా 'రక్షణ లేనిది' గా మారుతుందని ట్రంప్ హెచ్చరించారు. బహుశా 'తృతీయ ప్రపంచ దేశం స్థాయి'కి దిగజారిపోతుందని కూడా వ్యాఖ్యానించారు. ఈ ఏడాది దాదాపు ప్రతి దేశంపైనా ట్రంప్ టారిఫ్‌లు విధించారు. ట్రంప్ ఏకపక్షంగా టారిఫ్‌లు విధించడంపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బుధవారం జరిగిన వాదనల సందర్భంగా అనేక సందేహాలు వ్యక్తం చేశారు. తనకు టారిఫ్‌లు విధించడానికి తగిన అధికారాలు వున్నాయంటూ ట్రంప్ చెప్పడంపై అభ్యంతరాలు వెలిబుచ్చారు.

ఒత్తిడి ఎత్తుగడల వల్ల ఫలితం లేదు

- అమెరికా ఆంక్షలపై ఉత్తర కొరియా నిరసన

సియోల్ : సైబర్ నేరాలను లక్ష్యంగా చేసుకుంటూ ట్రంప్ ప్రభుత్వం తాజాగా విధించిన ఆంక్షలపై ఉత్తర కొరియా గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. తమ దేశం పట్ల అమెరికా ఘర్షణా వైఖరిని అవలంబిస్తోందని, తాము కూడా ప్రతీకార చర్యలు తీసుకుంటామని ఉత్తర కొరియా ఉప విదేశాంగ మంత్రి కిమ్ ఉన్ చోల్ పేర్కొన్నారు. సైబర్ నేరాల పథకాల ద్వారా మనీ లాండరింగ్ పాల్పడుతున్నారంటూ ఉత్తరకొరియా బ్యాంకర్లతో సహా 8మంది వ్యక్తులపై, రెండు సంస్థలపై మంగళవారం అమెరికా ఆర్థిక విభాగం ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో ఉత్తరకొరియా స్పందిస్తూ అమెరికా ఆంక్షలు, ఒత్తిడి తీసుకువచ్చే ఎత్తుగడల వల్ల ఎలాంటి ఫలితాలు వుండబోవని స్పష్టం చేసింది. దీనివల్ల ఉత్తర కొరియా ఆలోచనా వైఖరి, అభిప్రాయాలు మారబోవని, ప్రస్తుతమున్న వ్యూహాత్మక పరిస్థితులు మారవని కిమ్ ఉన్ చోల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దౌత్యాన్ని పునరుద్ధరించాలంటే ముందుగా అణ్వాయుధాలను విడనాడాలంటూ అమెరికా చేసిన డిమాండ్‌ను కిమ్ ఇటీవల తోసిపుచ్చారు.

వాషింగ్టన్‌ను గౌరవించాలి

- మమ్దానీకి ట్రంప్ హెచ్చరిక
- ప్రజల సమస్యలపై చర్చించేందుకు సిద్ధం : మమ్దానీ

వాషింగ్టన్ : న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీకి సాయపడేందుకు సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. తన బాధ్యతల నిర్వహణలో విజయం సాధించాలంటే ఆయన వాషింగ్టన్‌ను గౌరవించక తప్పదని హెచ్చరించారు. అవసరమైతే ట్రంప్‌తో పోరాడేందుకు సిద్ధమేనంటూ మమ్దానీ చేసిన వ్యాఖ్యను 'ప్రమాదకరమైన ప్రకటన'గా అభివర్ణించారు. 'ఆయనకు వాషింగ్టన్ అంటే పెద్దగా గౌరవం లేదు. ఆయన వాషింగ్టన్‌ను గౌరవించని పక్షంలో బాధ్యతల నిర్వహణలో విజయం సాధించలేరు' అని ఫాక్స్ న్యూస్ ప్రతినిధి బ్రెట్ బయర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'ఆయన విజయం సాధించాలని నేను కోరుకుంటున్నాను. న్యూయార్క్ నగరం కూడా బాగుండాలని అనుకుంటున్నాను' అని అన్నారు. ఆ వెంటనే మాట మార్చి తాను న్యూయార్క్ నగరం బాగుండాలని కోరుకుంటున్నానే తప్ప మమ్దానీ విజయం సాధించాలని కాదని అన్నారు. 'కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, గ్లోబలిస్టులకు అవకాశం వచ్చినప్పుడు వారు చేసిందేమీ లేదు.

విధ్వంసం తప్ప. ఇప్పుడు న్యూయార్క్‌లో కమ్యూనిస్టు ఏం చేస్తారో చూడాలి' అంటూనే " నేనే వైట్ హౌస్‌లో ఉండగా అమెరికా ఏవిధంగాను కమ్యూనిస్టుగా మారదు " అని మరోసారి ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. మరోవైపు మేయర్ ఎన్నికల్లో మమ్దానికి జనరేషన్ జెడ్ దాదాపు 75% ఓట్లు వేయగా, ఆసియన్లు 61%, అద్దెలకు ఉండేవారు 55% మంది ఓట్లు వేసారని ఎన్‌బిసి తెలిపింది.

జోహ్రాన్ గెలుపుతో సోషలిస్టులు, కమ్యూనిస్టుల్లో నూతనోత్సాహం

అభినందనలు తెలిపిన పలు పార్టీలు

ప్రపంచ పెట్టుబడికి కేంద్ర స్థానం అమెరికాలో ఓ సోషలిస్టు గెలవడం సోషలిస్టులు, కమ్యూనిస్టుల్లో నూతనోత్సాహం కలిగించింది. మమ్దాని గెలిచిన అనంతరం ఆయన తరుపున ప్రచారం చేసిన సోషలిస్టు బెర్నీ సాండర్స్‌ను కలిసారు. మమ్దానిని ఆయన అభినందించారు.

వివిధ దేశాల సోషలిస్టు పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు మమ్దానీకి అభినందనలు తెలిపాయి. ఆయా దేశాల్లో ఆయనకు మద్దతుగా, అమెరికాలో ప్రగతిశీల భావజాలం వ్యాప్తిని స్వాగతిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మమ్దాని విజయం నయా ఉదారవాద విధానాలతో విసిగిపోయిన ప్రజల తీర్పును ప్రతిబింబిస్తుందని యూరప్ అంతటా భావిస్తున్నారు. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ (ది లెఫ్ట్) కార్యదర్శి జాన్ వాన్ అకెన్ మమ్దానిని అభినందించారు. న్యూయార్క్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే జర్మన్లు ఎదుర్కొంటున్నారని, ఆహారం, విద్యుత్, రవాణా, అద్దెల భారం శ్రామికులకు వస్తున్న ఆదాయాలకంటే పెరిగిపోయాయన్నారు. మమ్దాని గెలుపు శ్రామిక వర్గాన్ని ఏకంచేసి సార్వత్రిక పోరాటాలకు నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.. కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఎ మమ్దాని గెలుపుని స్వాగతించింది. అమెరికన్ ప్రజలను బిలీనియన్లు పాలించరని పేర్కొంది. ట్రంప్ మాగా (ఎంఎఎంజి) విధానాలను న్యూయార్క్ వాసులు తిరస్కరించారని తెలిపారు. ఈ ఎన్నికలతో అమెరికావ్యాప్తంగా వామపక్ష భావాలపై చర్చ జరిగిందని, దీంతో సోషలిస్టు మూమెంట్‌కు ఊపు తిరిగొచ్చిందని ఎక్స్‌లో ప్రకటించింది.

ట్రంప్‌తో చర్చలకు సిద్ధమే : మమ్దానీ

ట్రంప్‌తో చర్చలకు సిద్ధమేనని న్యూయార్క్ నూతన మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ తెలిపారు. న్యూయార్క్‌లో పెరిగిన జీవన వ్యయంపై, ఎన్నికల్లో తానిచ్చిన వాగ్దాలను నెరవేర్చేందుకు ఆయనతో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నానని తెలిపారు. ట్రంప్ తీసుకొచ్చిన చట్టాలు తమ జీవితాలపై చూపే ప్రభావం గురించి, ఇతర సమస్యల గురించి న్యూయార్క్ వాసులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ అంశాలన్నింటినీ చర్చించి, ప్రజల సమస్యలను వీలైనంత పరిష్కరించేందుకు, వారికి మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రాణాంతక బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన అమెరికా

- 30 ఏళ్ల తర్వాత తొలి ప్రయోగం
- రష్యా, చైనాల కట్టడికేనంటున్న నిపుణులు

వాషింగ్టన్ : అమెరికా ప్రభుత్వం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసిబిఎం) మినిట్‌మ్యాన్-3ని ప్రయోగాత్మకంగా పరీక్షించింది. ఈ క్షిపణి మానవ రహితమైనది. అయితే దీనికి అణ్వాయుధ సామర్థ్యం ఉంది. దీనిని కాలిఫోర్నియాలోని వెండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ బుధవారం ప్రయోగించిందని న్యూయార్క్ పోస్ట్ పత్రిక తెలిపింది.

అణు దాడి జరిగినప్పుడే...

మార్షల్ దీవులలో సైనిక దళానికి చెందిన రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ పరీక్షా కేంద్రానికి సమీపంలో ఈ మానవ రహిత క్షిపణి కిందపడింది. అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించాలని ట్రంప్ ఆదేశించిన తర్వాత ఈ పరీక్ష జరగడం గమనార్హం. 30 సంవత్సరాల కాలంలో అమెరికా ఇలాంటి పరీక్షలు జరపలేదు. మినిట్‌మ్యాన్ - 3 క్షిపణి అమెరికా అణు నిరోధక దళంలో ఓ భాగం. శత్రు దేశం అణు దాడి జరిపినప్పుడే దీనిని ప్రయోగిస్తారు. ఈ క్షిపణి మాత్రమే కాదు... అమెరికా వద్ద అణ్వాయుధాలను మోసుకుపోయే జలాంతర్గాములు, వ్యూహాత్మక బాంబర్లు కూడా ఉన్నాయి. అమెరికా వద్ద ఉన్న ఎల్‌జిఎం-30జి మినిట్‌మ్యాన్ ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ క్షిపణి (ఐసిబిఎం) కూడా వ్యూహాత్మక అణు నిరోధక దళంలో భాగంగా ఉంటోంది. వైమానిక దళానికి చెందిన గ్లోబల్ స్ట్రైక్ కమాండ్‌లో దీనిని చేర్చారు.

ప్రత్యేకతలు ఇవే

ఖండాంతర మినిట్‌మ్యాన్-3 బాలిస్టిక్ క్షిపణి చాలా శక్తివంతమైనది. దీని వేగం గంటకు పదిహేను వేల మైళ్లు. పసిఫిక్ మహా సముద్రంలో 4,200 మైళ్ల దూరంలోని లక్ష్యాన్ని కూడా సులభంగా చేరుకోగలదు. ప్రతి క్షిపణిలోనూ స్వతంత్రంగా లక్ష్యాలను ఛేదించి తిరిగి బేస్‌కు చేరుకోగలిగిన వాహనాలను మోహరించారు. ప్రతి వాహనం వేర్వేరు లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదిస్తుంది. ఈ క్షిపణిని ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ దాని సామర్థ్యాన్ని పెంచుతున్నారు. అయినప్పటికీ మినిట్‌మ్యాన్-3ని క్రమేపీ పక్కన పెట్టి మరింత అత్యాధునిక ఎల్‌జిఎం-35ఎ సెంటినల్‌ను పూర్తి స్థాయిలో రంగంలోకి దింపాలని అమెరికా ఆలోచిస్తోంది. అమెరికా వ్యూహాత్మక రక్షణ సామర్థ్యానికి మినిట్‌మ్యాన్-3 పునాదిరాయిగా కొనసాగుతోంది. ఇది ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి ఆయుధం. అయినప్పటికీ 21వ శతాబ్దపు రక్షణ వ్యూహంలో ముఖ్య భూమిక పోషిస్తోంది. 1970వ దశకంలో రంగంలోకి దిగిన ఈ క్షిపణి అమెరికా భూ ఆధారిత అణ్వాయుధాలలో కీలక భాగంగా కొనసాగుతోంది. అణ్వాయుధ దేశాలైన రష్యా, చైనాలను కట్టడి చేసేందుకే అమెరికా ఈ క్షిపణి పరీక్ష జరిపిందని అణు నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆగని నెత్తుటి ధార

- ఎదురుకాల్పుల్లో మరో నలుగురు మావోయిస్టులు మృతి

బీజాపూర్ : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎన్‌కౌంటర్లు సాగుతున్నాయి. తాజా కాల్పుల్లో మరో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా తార్లగూడెం పరిధిలోని మరికెళ్ల అడవుల్లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. మద్దేడు ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు ఉన్నారనే పోలీసులకు సమాచారం అందింది. దీంతో తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం-మరికెళ్ల అడవుల్లో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ప్రస్తుతం భీకర ఎదురు కాల్పులు సాగుతున్నాయి. రెండురోజుల్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఆపరేషన్ కగార్' తో భారత భద్రతా దళాలు మావోస్టులను మట్టుబెడుతున్నారని పౌరహక్కుల వేదిక నాయకులు ఆరోపిస్తున్నారు.

ముంబయిలో రైలు ప్రమాదం

- ముగ్గురు మృతి, ఐదుగురికి గాయాలు

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో గురువారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని శాండ్‌హర్స్ట్ రైల్వే స్టేషన్ సమీపంలో ఒక స్తంభం వద్ద కొంతమంది వ్యక్తులను సబర్బన్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంతో సెంట్రల్ రైల్వేలైన్‌లో సేవలు నిలిచిపోయాయి. ప్రమాదవార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి సెంట్రల్ రైల్వే, ప్రభుత్వ రైల్వే పోలీస్, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్‌కు చెందిన బృందాలు బయలుదేరి వెళ్లాయి.

సహాయక కార్యక్రమాలు నిర్వహించాయి. గాయపడిన వారిని బైకుల్లాలోని శ్రీ జెజె ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి సెంట్రల్ రైల్వే ప్రతినిధి స్వప్నిల్ నీలా మాట్లాడుతూ రైలు వేగంగా వెళుతుండటం, పైగా చీకటిగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనని అన్నారు. ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని చెప్పారు.

కేంద్రం తీరు సరికాదు

- పదేపదే వాయిదాలు కోరడంపై జస్టిస్ గవాయ్ ఆగ్రహం

న్యూఢిల్లీ : ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం-2021పై కేంద్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ విభేదించారు. ఈ చట్ట నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలంటూ కేంద్రం పదే పదే కోరుతుండడంపై జస్టిస్ గవాయ్ అసహనం వ్యక్తం చేశారు. బెంచ్ ఏర్పాటును తప్పించడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. "ఇప్పటికే రెండుసార్లు మీరు కోరినట్లుగా వాయిదా వేశాం. ఇంకా ఎన్నిసార్లు జరగాలి? నవంబరు 24 తర్వాత దీన్ని కావాలనుకుంటే అప్పుడు మాకు చెప్పండి." అని సిజెఐ అన్నారు. 24వ తేదీనే జస్టిస్ గవాయ్ పదవీ విరమణ చేయనున్నారు. "అత్యున్నత రాజ్యాంగ కోర్టు పట్ల మాకు గౌరవం వుంది. రేపు మేం ఎలాంటి కేసులు చేపట్టడం లేదు. రేపు విచారణ జరిపి, వారాంతంలో తీర్పు ఇవ్వాలనుకుంటున్నాం." అని ఆయన చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని జస్టిస్ గవాయ్ విమర్శించడం ఇది రెండవసారి. ఇప్పటికే విచారణ జరుగుతుండగా, రాజ్యాంగ ధర్మాసనానికి ఈ అంశాన్ని నివేదించాలంటూ ప్రభుత్వం కోరడంపై ఈ నెల 3న సిజెఐ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. "అసలు ఇలాంటి వైఖరితో కేంద్రం ఎలా ముందుకు వస్తోందో తెలుసుకుంటే చాలా దిగ్భ్రాంతికి గురవుతు న్నాం. కేంద్రం నుండి ఇలాంటి ఎత్తుగడలను మేం ఊహించలేదు." అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. గత విచారణ సందర్భంగా ఈ అభ్యంత రాలు లేవనెత్తకపోగా వ్యక్తిగత కారణాలతో వాయిదా కోరారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత ఇలాంటి అభ్యంతరాలు లేవనెత్తరాదని అన్నారు. విస్తృత బెంచ్‌కు ఈ అంశాన్ని నివేదించాలన్న పిటిషన్‌ను జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ తోసిపుచ్చింది. విస్తృత బెంచ్‌కు రిఫర్ చేయాల్సిన అంశమని తేలితే అప్పుడు చేస్తామని, తదుపరి విచారణను 7వ తేదీకి వాయిదా వేశారు.

ఎస్‌ఐఆర్‌పై పిల్

- అఫిడవిట్ దాఖలు చేయాలని ఇసికి హైకోర్టు ఆదేశం

కొల్‌కతా : 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్‌ఐఆర్ ప్రక్రియను నిర్వహించడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిల్‌పై స్పందించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కొల్‌కతా హైకోర్టు ఆదేశించింది. ఇసి వైఖరిని తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. 2002 ఓటర్ల జాబితా ప్రకారం పశ్చిమ బెంగాల్‌తోసహా 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్‌ను ఇసి ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఈ పిల్ దాఖలయింది. 2025 డాక్యుమెంటేషన్, సమాచారం ఆధారంగా ప్రస్తుత ఎస్‌ఐఆర్‌ను నిర్వహించాలని పిటిషన్‌దారులు కోరారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓ)లకు తగిన భద్రత కల్పించాలని కూడా పిటిషనర్లు కోరారు. అనేకమంది ఎన్నికల సిబ్బంది పని ప్రదేశాల్లో బెదిరింపులను ఎదుర్కొంటున్నారని ఫిర్యాదు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను సిజె సుజోయ్ పాల్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ఇసి తరుపు న్యాయవాది అనామిక పాండే తన వాదనలు వినిపిస్తూ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించవద్దని కోరారు. ఇదే అంశం సుప్రీంకోర్టు ముందు విచారణలో ఉందని చెప్పారు. ఈ నెల 19లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

జీవన సౌరభం

జీవితంలో ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు నిరాశ చెందకూడదు. ఆ ఓటమి నుంచి పాఠాలను నేర్చుకుని మరోసారి ప్రయత్నిస్తే గెలుపు తథ్యం.

మీ కోసం

కలబందలో అనేక పోషకాలు ఉన్నాయి. దీని జెల్‌ని మెత్తగా చేసుకొని రాసుకుంటే చర్మాన్ని కాంతివంతం చేస్తుంది.

హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించా ...

హాయ్ ఫ్రెండ్స్,

హిందీ సబ్జెక్టు అంటే నాకెంతో ఇష్టం. అందుకే ఆ సబ్జెక్టు ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేలా కృషిచేస్తున్నా. దాచేపల్లి పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. గురజాలలోని తాజూన్ హిందీ కోచింగ్ నిర్వాహకులైన ఎం.రవికుమార్, ఎస్‌కె తాజూన్ మాస్టార్లు నన్నె ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. నిరంతరం మంచి క్రమశిక్షణతో కూడిన హిందీ సబ్జెక్టు అంశాలు బోధించారు. 2021 సెప్టెంబర్‌లో ప్రాథమిక, 2022 ఫిబ్రవరిలో మధ్యమ, సెప్టెంబర్‌లో రాష్ట్రభాష, 2023 సెప్టెంబర్‌లో ప్రవేశిక, 2024 ఫిబ్రవరిలో విశారద పూర్వార్ధ, సెప్టెంబర్‌లో విశారద పూర్వార్ధ, 2025 ఫిబ్రవరిలో ప్రవీణ ఉత్తరార్ధ, సెప్టెంబర్‌లో ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించా. మా తల్లిదండ్రులు మాలపాటి ఆదిత్య, మాలపాటి దినేష్‌కుమార్ మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

-మాలపాటి శశికాంత్, 7వ తరగతి, గురజాల, పల్నాడు జిల్లా.

ఇష్టం

నేర్చుకోవడం ఇష్టం
చదువుకోవటం ఇష్టం
ఆటలాడుకోవటం మరింత ఇష్టం
పాఠశాలలో మాస్టార్లు చెప్పే పాఠాలు
మా జీవితాల్లో వెలుగులకు సోపానాలు
ప్రతిరోజూ స్కూలుకు వెళ్తాం
కొత్త విషయాలు నేర్చుకుంటాం
అందుకే బడికెళ్లటం నాకెంతో ఇష్టం
చదువంటే నాకెంతో ఇష్టం
చక్కగా చదువుకుంటేనే కదా మంచి జీవితం
చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానం
అందుకే చక్కగా చదువుకుంటా
ప్రతిరోజూ క్రమం తప్పకుండా బడికెళ్తా
టీచర్లు చెప్పే సూచనలు పాటిస్తా

హోంవర్కులు ఏ రోజువి ఆరోజు పూర్తి చేస్తా
అమ్మానాన్న చెప్పే మాటలు వింటాం
క్రమశిక్షణతో మెలుగుతాం
భావి భారత పౌరులుగా స్థిరపడతాం

- బాణావతు సహశ్రీ, 4వ తరగతి, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు, కారంపూడి, పల్నాడుజిల్లా.

నాలుగు ఆల్బమ్‌లు తయారు చేశా ...

హాయ్ ఫ్రెండ్స్.

నాకు చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి ఏ బొమ్మ చూసినా దానిని గీచేస్తుంటాను. మనిషిని చూసి కూడా గీయగలను. ఇప్పటికే అనేక చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని బహుమతులు గెల్చుకున్నా. చదువులో కూడా ముందుంటా. మా ఇంటి దగ్గర పెయింటింగ్‌కి సంబంధించి ఆల్బమ్స్ తయారు చేస్తుంటాను. మా పాఠశాల యాజమాన్యం పలుసార్లు నన్ను అభినందించింది. తెలుగు అసోసియేషన్ వంటి పలు సంస్థల నుంచి బహుమతులు అందుకున్నా. దేశ నాయకులు, ఫాంటసీ, ప్రకృతికి సంబంధించి చిత్రాలు గీచినందుకు అభినందనలు వచ్చాయి.



పెయింటింగ్ వేస్తూ ఇప్పటికి నాలుగు ఆల్బమ్స్ తయారు చేశా.

- బొంతు సోహిత్, 6వ తరగతి, చైతన్య స్కూలు, సఖినేటిపల్లి మండలం, బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అవగాహన, అప్రమత్తతతోనే నియంత్రణ

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహనా దినం

ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకాన్ని భయపెడుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రాథమిక దశలో గుర్తించి వెంటనే చికిత్సలు ప్రారంభిస్తే అతిత్వరగా తగ్గే అవకాశం ఉంటుంది. అదే ముదరబెట్టుకుంటే తగ్గటం కూడా బాగా ఆలస్యమవుతుంది. అందుకే అవగాహన, అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం.



ప్రపంచంలో క్యాన్సర్ కేసులు అత్యధికంగా నమోదవుతున్న దేశాల్లో మనదేశం మూడో స్థానంలో ఉంది. మన దేశంలో గతేడాది సుమారు 15.6 లక్షల కేసులు నమోదు కాగా, 8.74 లక్షల మరణాలు చోటుచేసుకున్నట్లు అంచనా. నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రేషన్ ప్రకారం... సరాసరిన ప్రతి 9 మందిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఈ ఏడాది సగటున 12 శాతం ఉందని అంచనా. పురుషుల్లో ఊపిరితిత్తుల క్యాన్సరు, ఆడవాళ్లలో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సరు, చిన్న పిల్లల్లో బ్లడ్ క్యాన్సర్ (లుకేమియా) వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. మన జీవన శైలిలో మార్పులు, క్రమపద్ధతి లేని ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించటం వల్ల క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

చక్కటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, మెరుగైన జీవనశైలిని అలవర్చుకుని మేలైన వైద్య చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను ఎదుర్కోవడం సులభమే! ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా నయం చేయటమే కాకుండా తిరిగి రాకుండా నియంత్రణ చేసే చికిత్స పద్ధతులు నేడు అందుబాటులోకి వచ్చాయి.

ట్యూమర్లతోనే క్యాన్సర్ : మనిషి శరీరం లక్షల కోట్ల కణాలు (సెల్స్)తో నిర్మితమైనది. శరీరంలో కణాలు అనియంత్రణగా పెరిగి గుంపు మాదిరిగా మారడాన్నే ట్యూమర్ (కణజాలాల సమూహం)గా పిలుస్తాం. మాలిగ్నెంట్, బినైన్ ట్యూమర్లు. మాలిగ్నెంట్ ట్యూమర్ చాలా ప్రమాదకరం. శరీరంలో వ్యాపించి ఇతర కణాలకు కూడా క్యాన్సర్‌ను విస్తరింపజేస్తుంది. బినైన్ ట్యూమర్ మాలిగ్నెంట్‌లా వ్యాపించదు. పక్క టిష్యూస్‌పై దాడి చేయదు. అప్పుడప్పుడూ పెద్దవిగా మారతాయి. వీటిని ఆపరేషన్ చేసి తీసివేస్తే మళ్లీ పెరగవు.

కారకాలు ఏమిటంటే...

- పొగాకు ఉత్పత్తుల వాడకం
- ఒబేసిటీ (స్థూలకాయం)
- కుటుంబ వారసత్వం
- క్రమం తప్పిన జీవనశైలి
- గాలి, నీరు, ఆహార కాలుష్యం
- వ్యవసాయంలో క్రిమిసంహారకాలు
- పరిశ్రమల వ్యర్థాలు
- భూగర్భ జలాలు కలుషితం

క్యాన్సర్ లక్షణాలు

- మల, మూత్ర సమయాల్లో మార్పులు. రక్తం పడటం, నల్లగా విరోచనం
- మింగడం కష్టంగా అనిపించడం. అరుగుదల సరిగ్గా లేకపోవడం.
- మహిళల్లో అసాధారణంగా రక్తస్రావం, తెలుపు కావడం.
- శరీరంలో ఎక్కడైనా పుండు ఏర్పడి, అది తగ్గకపోవడం.
- పుట్టుమచ్చలు రంగు మారడం, పరిమాణంలో మార్పులు.
- శరీరంలో ఏ భాగంలోనైనా వాపు గానీ, గడ్డలు గానీ ఉండడం, ముఖ్యంగా మహిళల్లో రొమ్ముల్లో గడ్డలు.
- అలసటగా అనిపించడం, బరువు తగ్గటం.
- గొంతు బొంగురు పోవడం, రక్తహీనత, ఎడ తెగని దగ్గు.

మూడు రకాల చికిత్సలు

అన్ని క్యాన్సర్లకు ఒకే రకమైన ట్రీట్మెంట్ ఉండదు. క్యాన్సర్, రోగి శారీరక స్థితిగతులు, అవయవాల తీరు, క్యాన్సర్ దశను బట్టి చికిత్స విధానం మారుతూ ఉంటుంది. కొన్ని క్యాన్సర్లకి సర్జరీ, మరికొన్ని కేసులకు కీమోథెరపీ, ఇంకొన్నింటికి రేడియేషన్ అనేది ముఖ్యమైన చికిత్స అవుతుంది. చాలామంది రోగుల్లో ఈ మూడు పద్ధతులు కలిపి చేయాల్సి ఉంటుంది. మూడింట రెండొంతుల రోగుల్లో ఏదో ఒక రెండు పద్ధతుల్లో చేయాల్సి ఉంటుంది. మూడింట ఒక వంతులో ఏదో ఒక పద్ధతి ద్వారా మాత్రమే చికిత్స చేస్తే సరిపోతుంది. కొన్నిసార్లు సర్జరీ తర్వాత కీమోథెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. రేడియేషన్ అవసరమవ్వొచ్చు. రెండూ కలిపి చేయాల్సి రావొచ్చు. కొంతమంది రోగులకు అసలు సర్జరీయే లేకుండా రేడియేషన్ చికిత్స ఇంకా కీమోథెరపీ కలిపి చేయాల్సి వస్తుంది. మరికొంత మందికి మూడు పద్ధతులూ కలిపి చేయాల్సి ఉంటుంది.

ఇవీ చికిత్సా పద్ధతులు

ప్రస్తుతం కొన్ని ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయొచ్చు. అతి తక్కువ దుష్ప్రభావాలతో చికిత్స చేయడం అనేది ఇప్పుడు చాలా సులభంగా మారింది. సర్జరీలో అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ సర్జరీ, రోబోటిక్ సర్జరీల ద్వారా చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. రోగికి కుట్లు లేకుండానే చికిత్సలు జరుగుతాయి. నొప్పి తక్కువగా ఉంటుంది. త్వరగా కోలుకుని తన దైనందిన జీవితాన్ని సంతోషంగా గడపటానికి వీలుంటుంది. టార్గెట్ థెరపీ, ఇమ్యూన్ థెరపీ పద్ధతుల ద్వారా మందులతో చికిత్స చేస్తారు.

సర్జరీ (గడ్డల తొలగింపు) : గతంలో కేవలం సర్జరీల ద్వారానే చికిత్సలు అందించేవారు. ఇక్కడ ట్రీట్‌మెంట్ ద్వారా చికిత్సలు అందించి పెరిగిపోయిన గడ్డలను పూర్తిగా తొలగిస్తుంటారు. వ్యాధి ప్రాథమిక దశలో ఉన్న వారికి సర్జరీ ద్వారా పూర్తిగా తొలగించటానికి వీలుంటుంది.

కీమోథెరపీ (వ్యాధి ముదిరిన రోగులకు) : మందులను సెలైన్ ద్వారా ఇచ్చే ట్రీట్‌మెంట్. దీనివల్ల రక్తంలో పూర్తిగా కలిసి శరీరమంతా వ్యాపించి క్యాన్సర్ కణాలను చంపుతాయి. ఇలాంటి కీమోథెరఫీ వ్యాధి ముదిరిన రోగులకు ఇస్తారు. తద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించటానికి ఈ ట్రీట్‌మెంట్ ఎంతో మేలైనది. కీమోథెరఫీ ఇవ్వటం వల్ల శరీరంపై కొన్ని దుష్ప్రభావాలు ఉంటాయి. జుట్టు ఊడిపోవటం, శరీరం రంగు మారటం, నోటిపూత, విరోచనాలు అవ్వటం, వాంతులు వచ్చే అవకాశాలు ఉంటాయి. కానీ అవి తాత్కాలికమే. అవి రాకుండా కూడా కొన్ని రకాల మందులను ఇవ్వటం వల్ల వ్యాధిని నివారించొచ్చు. ఇంజక్షన్ ఇచ్చి ట్రీట్‌మెంట్ ఇస్తారు. స్టేజి దాటిన తర్వాత కీమోథెరపీ ఉపయోగించి రేడియోథెరపీ ద్వారా సంబంధిత గడ్డలను తొలగించొచ్చు.

రేడియోథెరపీ (క్యాన్సర్ సెల్స్‌ను చంపటానికి) : హైఎనర్జీ, ఎక్సరేను గామారేస్ ద్వారా క్యాన్సర్ సెల్స్‌ను చంపటానికి ఉపయోగిస్తారు. గర్భసంచి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్లు, గొంతు క్యాన్సర్లు ఈ కోవకు చెందుతాయి.

వీటితోపాటుగా ఇమ్యూనో థెరపీ, టార్గెటెడ్ థెరపీ కూడా ఉన్నాయి. క్యాన్సర్ కణాలను గురిచూసి కొట్టడం ద్వారా వాటిని తొలగించొచ్చు. పూర్తిగా తొలగించొచ్చు.

- డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ, ఎంఎస్, ఎంసిహెచ్ (బిహెచ్‌యు), ఎఫ్ఎంఎఎస్ చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్, అడ్వాన్స్‌డ్ లేపరోస్కోపిక్ సర్జన్, గాయత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, విజయవాడ.

అల్లు అర్జున్ కోసం కొత్త ప్రాజెక్టులు సిద్ధం

కథానాయకుడు అల్లు అర్జున్ మరికొన్ని కొత్త ప్రాజెక్టులకు సిద్ధమవుతున్నారు. పుష్ప: ది రైజ్‌తో ఆయన బాలీవుడ్ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మాణంలో ఈ పాన్ ఇండియా మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇది పూర్తయిన తర్వాత దర్శకుడు ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో అర్జున్ నటించబోతున్నారు. దీనికి 'రవణం' అనే టైటిల్‌ను సిద్ధం చేశారని సమాచారం. మహేష్‌బాబు ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత అల్లు అర్జున్‌తో ఎస్ఎస్ రాజమౌళి సినిమా చేయనున్నారని అంటున్నారు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ సంజయ్‌లీలా భన్సాలీతో కూడా బన్నీ స్క్రిప్ట్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అలాగే, బోయపాటి శ్రీను దర్శకత్వంలో సరైనోడు 2 రూపుదిద్దుకునే అవకాశముంది.



రాజా శివాజీలో సల్మాన్‌ఖాన్

బాలీవుడ్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్ రాజా శివాజీ సినిమాలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ నటిస్తోన్న హిస్టారికల్ ఎపిక్ ప్రాజెక్ట్ ఇది. మరాఠా సామ్రాజ్యం, లెజెండరీ వారియర్స్‌కు నివాళిగా తెరకెక్కిస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు అత్యంత నమ్మకస్తుడిగా జీవా మహల ఉండేవారనీ, ఈ పాత్రలో సల్మాన్‌ఖాన్ నటించబోతున్నారని నిర్మాతలు ప్రకటించారు. సల్మాన్‌ఖాన్ సీక్వెన్స్ షూట్‌ను శుక్రవారం నాడు ప్రారంభించారు. సంజయ్‌దత్ అఫ్జల్ ఖాన్‌గా కనిపించబోతున్నారు. వచ్చే ఏడాది మే 1న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

వేసవిలో విశ్వక్‌సేన్ 'ఫంకీ'

విశ్వక్‌సేన్, కయాదు లోహార్ జంటగా నటిస్తున్న సినిమా 'ఫంకీ'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ మూడో తేదీన విడుదల కానుంది. వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్‌సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి.అనుదీప్ కలయికలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇటీవలే ఈ సినిమాను విడుదలైన టీజర్ ట్రెండింగ్‌లో ఉంది. దర్శకుడు కె.వి.అనుదీప్ తనదైన కామెడీ జానర్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కూర్పు నవీన్ నూలి, ఛాయాగ్రహణం సురేష్ సారంగం, రచనా సహకారం మోహన్, సహ నిర్మాత వెంకట్ ఉప్పుటూరి.

కొత్త ప్రాజెక్టులో శ్రీవిష్ణు

శ్రీవిష్ణు కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ప్రొడక్షన్ నం.39 పేరుతో కొత్త సినిమాను నిర్మించబోతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్, రచన దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో ఆవిష్కరించబడిన ఈ అనౌన్స్‌మెంట్ పోస్టరు ఆకట్టుకునేలా ఉంది. 'అనగనగా'తో ఓటీటీలో అరంగేట్రం చేసి ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

ఉదయ్‌పూర్‌లో విజయ్ - రష్మికల పెళ్లి

నటులు విజయ్ దేవరకొండ– రష్మిక మందన్న వివాహం ఉదయ్‌పూర్‌లో జరగనున్నట్టు భోగట్టా. వీరి వివాహ నిశ్చితార్థం ఇప్పటికే జరిగిన సంగతి తెలిసిందే! వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ కోటలో వీరి వివాహం జరగనుందని తెలిసింది. రష్మిక మందన్న నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా శుక్రవారం విడుదల కానుంది.

స్పిన్నర్ల మాయ

- అక్షర్, సుందర్ దెబ్బకు ఆసీస్ ధమాల్
- నాల్గో టి20లో టీమిండియా ఘన విజయం

గోల్డ్‌కోస్ట్: వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత జట్టు టి20 సిరీస్‌ను చేజారకుండా కాపాడుకుంది. కీలకమైన నాలుగో టి20 గెలుపులో స్పిన్నర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ కీలకపాత్ర పోషించారు. టీమిండియా నిర్దేశించిన 168పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్‌ను 119పరుగులకే కట్టడి చేశారు. అక్షర్ పటేల్(21నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ షోకి తోడు వాషింగ్టన్ సుందర్(3/3) కెరీర్ బెస్ట్ బౌలింగ్ తోడవ్వడంతో టీమిండియా 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం లభించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(28), వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(46) తొలి వికెట్‌కు 56పరుగులు జతచేశారు. ఫామ్ లేమితో తంటాలు పడుతున్న గిల్.. ఎట్టకేలకు క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబే(22), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(20)లు ఫర్వాలేదనిపించారు. మిడిలార్డర్ చేతులెత్తేగా.. ఆఖర్లో అక్షర్ పటేల్(21 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ తోడైంది. దీంతో టీమిండియా నిర్ణీత 20ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా పేసర్ ఎల్లిస్, స్పిన్నర్ జంపా మూడేసి వికెట్లతో రాణించారు. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు తొలుత నిరాశపరిచారు. దీంతో ఆసీస్ టాపార్డర్‌కు శుభారంభం లభించింది. డేంజరస్ ఓపెనర్ మాథ్యూ షార్ట్(25), ఇంగ్లిస్(12)లను స్వల్ప స్కోర్లకే ఔట్ చేసి పట్టు బిగించాడు. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆసీస్ 48 పరుగులు చేసింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఇంగ్లిస్ అక్షర్ పటేల్ ఓవర్లో బౌల్డ్ కాగా.. దూకుడుగా ఆడుతున్న కంగారూ కెప్టెన్ మిచెల్ మార్ష్(30)ను దూబే ఔట్ చేసి

బ్రేకిచ్చాడు. అతడి ఓవర్లో పెద్ద షాట్ ఆడిన మార్ష్ బౌండరీ వద్ద అర్ష్‌దీప్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 70కే మూడు వికెట్లు పడిన వేళ టిమ్ డేవిడ్(14), ఫిలిప్పే(10)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, వీరిద్దరూ స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. ఆస్ట్రేలియా ఒక దశలో 5వికెట్లు నష్టపోయి 103పరుగులతో పటిష్టంగా నిలుచినా.. డేంజర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(2)ను వరుణ్ బౌల్డ్ చేయడం, సుందర్ ఒకే ఓవర్లో స్టొయినిస్(17), బార్ట్‌లెట్(0)లను ఔట్ చేయడంతో ఫలితం మారింది. బుమ్రా అద్భుత బంతికి డ్వార్షిస్(5)ను బౌల్ చేయగా.. సుందర్ ఓవర్లో జంపా గిల్ చేతికి చిక్కడంతో ఆస్ట్రేలియా జట్టు 119కే ఆలౌటయ్యింది. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో భారతజట్టు 2–1తో ముందంజలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్‌కు లభించగా.. ఐదో, చివరి టి20 బ్రిస్బేన్ వేదికగా శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి)టిమ్ డేవిడ్ (బి)జంపా 28, శుభ్‌మన్ (బి)ఎల్లిస్ 46, దూబే (బి)ఎల్లిస్ 22, సూర్యకుమార్ (సి)టిమ్ డేవిడ్ (బి)బార్ట్‌లెట్ 20, తిలక్ వర్మ (సి)ఇంగ్లిస్ (బి)జంపా 5, జితేశ్ శర్మ (ఎల్‌బి)జంపా 3, సుందర్ (సి)కుహ్నేమన్ (బి)ఎల్లిస్ 12, అక్షర్ (నాటౌట్) 21, అర్ష్‌దీప్ (సి)ఫిలిప్పే (బి)స్టొయినీస్ 0, చక్రవర్తి (నాటౌట్) 1, అదనం 9. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 167పరుగులు. **వికెట్ల పతనం:** 1/56, 2/88, 3/121, 4/125, 5/131, 6/136, 7/152, 8/164 **బౌలింగ్:** డ్వార్షిస్ 4-0-31-0, బార్ట్‌లెట్ 4-0-26-1, ఎల్లిస్ 4-0-21-3, స్టొయినీస్ 4-0-41-1, జంపా 4-0-45-3.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి)అర్ష్‌దీప్ (బి)దూబే 30, షార్ట్ (ఎల్‌బి)అక్షర్ 24, ఇంగ్లిస్ (బి)అక్షర్ 12, టిమ్ డేవిడ్ (సి)సూర్యకుమార్ (బి) దూబే 14, ఫిలిప్పే (సి)వరుణ్ చక్రవర్తి (బి)అర్ష్‌దీప్ 10, స్టొయినీస్ (ఎల్‌బి)సుందర్ 17, మ్యాక్స్‌వెల్ (బి)వరుణ్ చక్రవర్తి 2, డ్వార్షిస్ (బి)బుమ్రా 5, బార్ట్‌లెట్ (సి అండ్ బి)సుందర్ 0, ఎల్లిస్ (నాటౌట్) 2, జంపా (సి)శుభ్‌మన్ (బి)సుందర్ 0, అదనం 2. (18.2ఓవర్లలో ఆలౌట్) 119పరుగులు. **వికెట్ల పతనం:** 1/37, 2/67, 3/70, 4/91, 5/98, 6/103, 7/116, 8/116, 9/118, 10/119 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-22-1, బుమ్రా 4-0-27-1, వరణ్ చక్రవర్తి 4-0-26-1, అక్షర్ 4-0-20-2, దూబే 2-0-20-2, సుందర్ 1.2-0-3-3.

జురెల్ సెంచరీ

- నిరాశపరిచిన పంత్, రాహుల్
- ఇండియా–ఎ 255ఆలౌట్
- దక్షిణాఫ్రికా–ఎతో అనధికారిక టెస్ట్

బెంగళూరు: దక్షిణాఫ్రికా–ఎతో జరుగుతున్న రెండో అనధికారికి టెస్టులో భారత 'ఏ' జట్టు గొప్పగా పుంజుకుంది. టాపార్డర్ విఫలమైనా.. ధృవ్ జురెల్ (132 నాటౌట్) సూపర్ సెంచరీతో టీమిండియాను ఆదుకున్నాడు. సఫారీ పేసర్ టియాన్ వాన్ వురేన్ (4/54) ధాటికి ప్రధాన ఆటగాళ్లలంతా పెవలియన్‌కు చేరారు. కేఎల్ రాహుల్(19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు నిరాశపరచగా.. జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న జురెల్ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. తొలి సెషన్ ఆరంభంలోనే ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్(0)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు మొరెకీ. ఆ తర్వాత రాహుల్‌ను వురేన్ బోల్తా కొట్టించగా.. కుదరుకున్న సాయి సుదర్శన్‌ను సుబ్రయేణ్ ఎల్బీగా వెనక్కి పంపాడు. 41కే మూడు వికెట్లు పడిన దశలో క్రీజ్‌లోకి వచ్చిన పంత్ దూకుడుగా ఆడే క్రమంలో మొరెకి ఓవర్లో ఔటయ్యాడు. సఫారీ బౌలర్ల జోరుతో రెండో సెషన్‌లోనే కుప్పకూలేలా కనిపించిన టీమిండియాను ధ్రువ్ జురెల్ అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా క్రీజులో పాతుకుపోయిన జురెల్.. సఫారీలను విసిగిస్తూ కుల్దీప్ యాదవ్(20), సిరాజ్(15)ల సాయంతో సెంచరీని పూర్తి చేశాడు. 89 పరుగులకే ఐదు వికెట్లు పడిన దశలో టెయిలెండర్లతో కలిసి స్కోర్ 200 పరుగులు దాటించాడు. సెంచరీ తర్వాత జురెల్ ధాటిగా ఆడినా.. ప్రసిధ్ కష్ణను వురేన్ ఔట్ చేయడంతో ఇండియా–ఎ తొలి ఇన్నింగ్స్ 255పరుగుల వద్ద ముగిసింది.

జురెల్ (132నాటౌట్)

2026 టి20 ప్రపంచకప్‌కు
ఏడు వేదికలతో ఐసిసి షార్ట్ లిస్ట్

- ఫైనల్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం?

దుబాయ్: భారత్ ఆతిథ్యమిచ్చే 2026 ఐసిసి టి20 ప్రపంచకప్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) వేదికలను ప్రకటించింది. భారత్‌లోని ఐదు, శ్రీలంకలోని రెండు వేదికలను ఖరారు చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌లోని అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబయి, ఢిల్లీతోపాటు శ్రీలంకలోని కొలంబో, కాండీ వేదికలను ఖరారుచేస్తున్నట్లు తాజా ప్రకటనలో పేర్కొంది. పాకిస్తాన్ జట్టు భారత్‌లో పర్యటించేందుకు నిరాకరించడంతో శ్రీలంకలోని 2వేదికలను ఖరారు చేయాల్సి వచ్చిందని, పాక్ జట్టు సెమీస్, ఫైనల్‌కు చేరితే ఆ మ్యాచ్‌లు కూడా కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలోనే జరుగుతాయని తెలిపింది. లేనిపక్షంలో అహ్మదాబాద్‌లో టి20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు, శ్రీలంక జట్టు సెమీస్‌కు చేరిన పక్షంలో కొలంబోలోనే ఆ మ్యాచ్ ఆడనున్నట్లు పేర్కొంది. టి20 ప్రపంచకప్‌కు ఐసిసి ప్రకటించిన షార్ట్ లిస్ట్‌లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంకు చోటు దక్కలేదు. 2026 టి20 ప్రపంచకప్‌లో తొలిసారి 20జట్లు పోటీపడుతున్న సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68